RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 | సంచిక : 67 | మంగళవారం, ఏప్రిల్ 9, 2024 | పేజీలు : 4

## ఎన్నికల ముందు ఎందరిని జైలులో పెడతారు?

న్యూఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌పై కించపరిచే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న ఒక యూట్యూబర్‌కు మంజూరైన బెయిల్‌ను సుప్రీం కోర్టు పునరుద్ధరించింది. సోషల్ మీడియాలో ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరినీ జైలులో పెట్టజాలరని కోర్టు వ్యాఖ్యానించింది. తనకు మంజూరైన స్వేచ్ఛను ఎ దురైమురుగన్ సట్టై దుర్వినియోగం చేశారనేందుకు దాఖలాలు ఏవీ లేవని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. తమిళనాడుకు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి జస్టిస్ ఓకా విచారణ సమయంలో ఒక కీలక ప్రశ్న వేశారు. 'ఎన్నికలకు ముందు యూట్యూబ్‌లో ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరినీ కటకటాల వెనుకకు పంపడాన్ని మనం ప్రారంభించినట్లయితే ఎంత మంది జైలులో ఉంటారో ఊహించండి' అని జస్టిస్ ఓకా అన్నారు.

## "జైల్ కా జవాబ్ వోట్ సే" నినాదంతో ఆప్ ప్రచారం ప్రారంభం

న్యూఢిల్లీ : ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం నాడు ఢిల్లీలో నిరాహార దీక్ష సాగించిన ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం "జైల్ కా జవాబ్ నోట్ సే" నినాదంతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆప్ రాజ్యసభ సభ్యుడు సందీప్ పాథక్ మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యారని, ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని నడుపుతున్న నాయకుడిని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అరెస్ట్ చేయడం ఇదే మొదటిసారని తీవ్రంగా విమర్శించారు. ఈ సమయంలో ప్రజలంతా కేజ్రీవాల్‌కు సంఘీభావం తెలియజేయడం కోసం జైల్ కా జవాబ్ వోట్ సే ప్రచారాన్ని ప్రారంభించామని వెల్లడించారు. ఈ ప్రచారంలో భాగంగా ఆప్ నేతలు, కార్యకర్తలు ఎక్కడైతే తమ అభ్యర్థులు పోటీకి నిల్చున్నారో ఆ నాలుగు నియోజక వర్గాల్లో ప్రచారం సాగిస్తారని చెప్పారు. ఓట్లతో నియంతృత్వానికి గుణపాఠం చెప్పాలని ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ ప్రజలను కోరారు. ఆప్ ఇంతవరకు న్యూఢిల్లీ, తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, పశ్చిమఢిల్లీల్లో తన అభ్యర్థులను పోటీకి నిలబెట్టింది. మిగిలిన మూడు స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తోంది.




## కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలు : బీజేపీ అధ్యక్షుడు నడ్డా విమర్శ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు సాగిస్తూ , సమాజం లోని అత్యధిక వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా సోమవారం తీవ్రంగా విమర్శించారు. రిజర్వేషన్ 50 శాతం వరకు పెంచుతామని హామీ ప్రకటించడం ఎవరికి ప్రయోజనం కలిగిస్తుందో స్పష్టం చేయాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలీగ్ మేనిఫెస్టోలా ఉందని, స్వాతంత్ర్యం రాకముందు పాకిస్థాన్ కోసం సాగిన ఉద్యమం నాటి పరిస్థితులు కల్పిస్తుందని ప్రధాని మోడీ చేసిన విమర్శకు మద్దతు పలికారు. ప్రజలు అదేపనిగా తిరస్కరిస్తున్నా కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని , అదికారంపై ఉన్న అత్యాశతో దేశాన్ని విడదీస్తోందని ధ్వజమెత్తారు.



## మన "ఆదిత్య "కు సంపూర్ణ సూర్యగ్రహణం చిక్కదట



న్యూఢిల్లీ : ఉత్తర అమెరికా, కెనడా మీదుగా సోమవారం ఏర్పడనున్న సంపూర్ణ సూర్యగ్రహణం ఈ ఏడాది సంభవించే అతిపెద్ద ఖగోళ ఘటన. అరుదైన ఈ సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ప్రజలు చూసేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తున్నా, అంతరిక్షంలో ఉన్న మన "ఆదిత్య" మాత్రం చూడలేదట. ఆదిత్య ఎల్ 1 ను ఉంచిన స్థానమే దీనికి కారణం అని చెబుతున్నారు. సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలుగా లాగ్రాంజ్ పాయింట్ 1 (ఎల్1) చుట్టూ ఉన్న కక్షలో దీన్ని ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో గ్రహణ ప్రభావం లేకుండా 'ఆదిత్య ఎల్ 1' కు సూర్యుడు ప్రతిక్షణం కనిపిస్తాడు. సాధారణంగా సూర్యుడికి భూమికి మధ్యలో చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు ఈ గ్రహణం ఏర్పడుతుంది. అయితే నేటి సంపూర్ణ సూర్యగ్రహణం సమయంలో భానుడిని పూర్తిగా కమ్మేసే చంద్రుడు ఈ శాటిలైట్‌కు వెనుకవైపు ఉంటాడు. అంటే సూర్యుడికి, చంద్రుడికి మధ్యలో అన్నమాట. అందుకే గ్రహణ ఘట్టాన్ని ఆదిత్య ఎల్ 1 వీక్షించలేదని ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ వెల్లడించారు. అయితే గ్రహణ సమయంలో సూర్య కిరణాల ప్రభావం ఎలా ఉండనుందనే విషయాలను ఈ మిషన్ పరిశీలించనుంది. క్రోమోస్ఫియర్ , నక్షత్రాల కరోనాను మరింత అధ్యయనం చేసేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబరులో ఆదిత్య ఎల్1 ను ప్రయోగించిన సంగతి తెలిసిందే. దాదాపు నాలుగు నెలల పాటు రోదసీలో ప్రయాణించిన శాటిలైట్... ఈ ఏడాది జనవరిలో భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్ 1 ను చేరుకుంది. దాని చుట్టూ ఉన్న కక్షలో పరిభ్రమిస్తూ అధ్యయనాలు సాగిస్తోంది.

## బిజెపి పాలనలో పత్రికా స్వేచ్ఛ అదృశ్యం

తిరువనంతపురం: బిజెపి పాలనలో పత్రికా స్వేచ్ఛ కనుమరుగైపోయిందని, తమ పాలనను కీర్తించని మీడియా సంస్థలపై సంఘ్ పరివార్ నిరంతరం వేధింపులకు పాల్పడుతోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. సోమవారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిబిసికి చెందిన ఇండియా వార్తావిభాగాన్ని మూసివేసినట్లు వెలువడిన వార్తలపై స్పందించారు. భారతదేశ విదేశీ పెట్టుబడుల నిబంధనలకు లోబడి లండన్‌కు చెందిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బిబిసి) తన భారత విభాగాన్ని మూసివేసినట్లు వార్తలు వెలువడ్డాయని, ఆదాయం పన్ను శాఖ నుంచి నిత్యం వేధింపులు ఎదురవుతుండడంతో బిబిసి ఈ నిర్ణయాన్ని తీసుకోక తప్పలేదని విజయన్ చెప్పారు. బిజెపి పాలనలో పత్రికా స్వేచ్ఛ కనుమరుగైపోయిందని, తమ పాలనను కీర్తించని మీడియా సంస్థలను సంఘ్ పరివార్ నిరంతరం టార్గెట్ చేస్తున్నట్లు కనపడుతోందని, ఇటువంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి రానున్న ఎన్నికలే గొప్ప అవకాశంగా తాము భావిస్తున్నామని విజయన్ తెలిపారు. మీడియాను కట్టడి చేయాలని నియంతలు ఎల్లప్పుడూ భావిస్తారని, బిజెపి పాలనలో మళ్లీ ఎమర్జెనీ రోజులు రానున్నట్లు జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నాయని ఆయన చెప్పారు. తమకు విధేయంగా మీడియా ఉండాలన్నది బిజెపి అజెండాగా ఆయన అభిర్ణించారు. తమకు లొంగిపోని మీడియాను అణచివేయడానికి అటువంటి పాలకులు ప్రయత్నిస్తారని, బిబిసి విషయంలో పాలకుల దాడులు, బెదిరింపులు స్పష్టంగా కనిపించాయని ఆయన ఆరోపించారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిలో భారత్ ర్యాంకింగ్ దిగజారిపోయిందని ఆయన ఆరోపించారు. పారిస్‌కు చెందిన రిపోర్టర్స్ వితౌడ్ బార్డర్స్ రూపొందించిన 2023 నివేదిక ప్రకారం భారత పత్రికా స్వచ్ఛ మొత్తం 180 దేశాలలో 150 నుంచి 161వ ర్యాకుకు పడిపోయిందని ఆయన చెప్పారు. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా వార్తలు రాసిన జర్నలిస్టులు, మీడియా సంస్థలపై ఏ రకమైన వేధింపులు జరుగుతున్నాయో దేశం యావత్తు చూసిందని విజయన్ చెప్పారు. ఢిల్లీ అల్లర్లపై 2020లో వార్తలు ప్రచురించిన కేరళలోని రెండు మీడియా సంస్థల లైసెన్సులను రద్దు చేసిన ఘటనను ఆయన గుర్తు చేశారు. కేరళలో ఈ నెల 26న ఒకే విడతలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి.



## సిఎం రేవంత్ రెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం

హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్ వెళ్తున్న సమయంలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోని టిజి 09 ఆర్‌ఆర్ 0009 నెంబర్ గల ల్యాండ్ క్రూజర్ వాహనం టైరు ఒక్కసారిగా పేలింది. సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళ్తుండగా మార్గమధ్యలో సిఎం కాన్వాయ్‌లోని ఓ కారు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది. దీంతో సిఎం, భద్రతా సిబ్బంది ఊపిరిపీల్చు కున్నారు. వెంటనే ఆ టైరును రిపేరు చేయడానికి స్థానికంగా ఉన్న మెకానిక్‌ను సిబ్బంది పిలిపించారు. ఈ ఘటన జరిగాక ఈ ఒక్క కారు తప్ప మిగిలిన వాహనాలతో రేవంత్ కొడంగల్‌కు బయలుదేరి వెళ్లారు.



## కేంద్ర, రాష్ట్రాల మధ్య ఘర్షణ తగదు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వాలు తమ వద్దకు ఇటీవలి కాలంలో తరచు వస్తున్న ఉదంతాలపై సుప్రీంకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఒకరిపై ఒకరు ఘర్షణ పడడం కన్నా పరస్పర సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు పిలుపునిచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ ఉండరాదని కరవు సహాయ నిధుల విడుదల కోరుతూ కర్నాటక ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సంర్భంగా సుప్రీంకోర్టు సూచించింది.అనేక జిల్లాలలో కరవు నెలకొన్న దృష్టా కర్నాటక ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేయలేదని పిటిషన్ పేర్కొంది. కేంద్రం నిధులను విడుదల చేయకపోవడం తమ రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పిటిషన్‌లో కర్నాటక తెలిపింది. కరవు పరిస్థితిపై ఆరు నెలల క్రితం(గత ఏడాది అక్టోబర్) అంతర్ మంత్రివర్గ బృందం సమర్పించిన నివేదికపై కేంద్రం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని కూడా కర్నాటక ప్రభుత్వం తెలిపింది. ఎన్‌డిఆర్‌ఎఫ్ నిధులను ఆపడం వల్ల పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చిందని తెలిపింది. నివేదికను సమర్పించిన తర్వాత నెలరోజుల్లో దానిపై చర్యలు తీసుకోవలసి ఉంటుందని కర్నాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. కాగా..లోక్‌సభ ఎన్నికలు మరో 11 రోజుల్లో జరగనున్న తరుణంలో ఈ పిటిషన్ దాఖలు చేయడాన్ని కేంద్రం తప్పుపట్టింది. సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని సంప్రదించి ఉండవలసిందని కేంద్రం వాదించింది. వాద ప్రతివాదనలు విన్న జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం దీనిపై ఆదేశాలు తీసుకోవడానికి కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు రెండు వారాల వ్యవధిని ఇచ్చింది.



## ప్రధాని మోడీపై కాంగ్రెస్ ఫిర్యాదు

- మోడీ 'ముస్లిం లీగ్' వ్యాఖ్యకు పార్టీ ఆక్షేపణ
- కాంగ్రెస్ మేనిఫెస్టోను ముస్లిం లీగ్‌తో పోల్చిన మోడీ
- 6న అజ్మీర్ ర్యాలీలో ఆ వ్యాఖ్య చేసిన మోడీ
- కాంగ్రెస్ మేనిఫెస్టో 'అబద్ధాల పుట్ట' అని విమర్శ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ మేనిఫెస్టోలా ఉందని వ్యాఖ్యానించిన ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్ (ఇసి)కి ఫిర్యాదు చేసింది. శనివారం (6న) రాజస్థాన్ అజ్మీర్‌లో ఒక ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ఆ వ్యాఖ్య చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను 'అబద్ధాల పుట్ట' అని అభివర్ణించిన మోడీ ఆ డాక్యుమెంట్‌లో ప్రతి పేజీ 'భారత్‌ను ముక్కలు చేసే యత్నం'గా కనిపించిందని ఆరోపించారు. ముస్లిం లీగ్ ముద్ర ఉన్న ఆ మేనిఫెస్టో తరువాయి భాగాన్ని లెఫ్టిస్టులు తీసుకున్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు సిద్ధాంతాలు గానీ, విధానాలు గానీ లేవు. కాంగ్రెస్ ప్రతిదీ కాంట్రాక్ట్ ఇచ్చిందని, మొత్తం పార్టీ ఔట్‌సోర్స్ చేసినట్లు ఉందని కనిపిస్తోంది' అని మోడీ అన్నారు. ప్రధాని వ్యాఖ్యకు కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. లోక్‌సభ ఎన్నికల్లో 180 సీట్ల లక్ష్యాన్ని దాటేందుకు బిజెపి తంటాలు పడే అవకాశం ఉండడంతో ఆయన భయపడినట్లున్నారని, 'అదే హిందు, ముస్లిం స్క్రిప్ట్' వాదనకు దిగారని కాంగ్రెస్ విమర్శించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బిజెపిపై విమర్శలకు దిగారు. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి, ముస్లిం లీగ్‌కు వారి 'సైద్ధాంతిక పూర్వీకులు' మద్దతు ఇచ్చారని ఖర్గే ఆరోపించారు.

## మహిళల ఖాతాల్లోకి రూ. లక్ష

శివ్‌ని (మధ్య ప్రదేశ్) : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తామని సోమవారం ధీమా వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళల ఖాతాల్లోకి ఏటా లక్ష రూపాయలను కొత్త ప్రభుత్వం బదలీ చేస్తుందని రాహుల్ ప్రకటించారు. మాండ్లా లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని శివ్‌ని జిల్లా ధనోరాలో ఒక ర్యాలీలో ప్రసంగించిన రాహుల్ నిరుద్యోగ యువజనులకు గ్యారంటీగా అప్రెంటిస్‌షిప్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి కేటగరీలు, వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలు, నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి లక్ష రూపాయల బదలీ వంటి మూడు నాలుగు విప్లవాత్మక చర్యల గురించి మా మేనిఫెస్టో ప్రస్తావించింది.

ఈ విధంగా ప్రతి నెల వారి ఖాతాల్లోకి వేలాది రూపాయలను మేము బదలీ చేయనున్నాం' అని ఆయన తెలియజేశారు. మాండ్లా నియోజకవర్గంలో ప్రస్తుత ఎంపి, కేంద్ర మంత్రి ఫగ్గన్ కులస్థేకు పోటీగా మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ ఓంకార్ సింగ్ మార్కమ్‌ను కాంగ్రెస్ నిలబెట్టింది. ఆశా, అంగన్‌వాడీ కార్మికులకు చెల్లిస్తున్న మొత్తాన్ని రెట్టింపు చేస్తామని కూడా కాంగ్రెస్ వాగ్దానం చేసినట్లు రాహుల్ తెలిపారు. దేశంలోని నిరుద్యోగ యువజనులు'ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఒక ఏడాది పాటు అప్రెంటిస్‌షిప్ పొందేలా చూసేందుకు మేము కొత్త చట్టం కూడా తీసుకువస్తాం.

ఆ కాలంల వారు భత్యంగా లక్ష రూపాయలు కూడా పొందగలరు' అనికాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చెప్పారు. అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన తరువాత వారి ప్రదర్శన బాగున్నట్లయితే అదే ప్రదేశంలో ఉద్యోగం పొందగలరని ఆయన సూచించారు. 'కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత మేము ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిని అంతం చేస్తాం. ప్రభుత్వ రంగంలో 30 లక్షల ఖాళీలు భర్తీ చేస్తాం' అని రాహుల్ తెలిపారు. రైతులు తమ పంటలకు తగినంత ఎంఎస్‌పి పొందేలా చూసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక చట్టం చేస్తుందని ఆయన చెప్పారు. రైతులు ఎంఎస్‌పి కోసం సుదీర్ఘ కాలంగా ఆందోళన చేస్తున్న విషయం విదితమే. బిజెపి గిరిజనులను 'ఆదివాసీలు'గా పిలవడానికి బదులు 'వనవాసీలు'గా ఉద్దేశపూర్వకంగా పేర్కొంటున్నదని, వారి భూముల నుంచి వారిని తొలగించడం, నీరు, అడవి, భూమిపై వారి తొలి హక్కును కైవసం చేసుకోవడం ఆ పార్టీ ధ్యేయమని ఆయన ఆరోపించారు. వారి (గిరిజనుల) భూములను పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలని ఆ పార్టీ కోరుకుంటున్నదని రాహుల్ ఆరోపించారు.



## సంపాదకీయం

### విద్యాహక్కు చట్టం అమలు ఏది?

పాఠశాలలకు వెళ్లాల్సిన బడి ఈడు పిల్లలు బడిలో చేరడం, చేరినవారు కొనసాగడం, వారందరూ ఆనందంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువైన, ప్రోత్సాహకరమైన ,స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో కల్పించడానికి 13 ఏళ్ల క్రితం ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. 6-14 వయసు గల పిల్లలందరికీ ప్రాథమిక విద్యను హక్కుగా మారుస్తూ సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన ఈ చట్టం ఆచరణలో చతికిలపడింది. దేశంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలన్నీ పాతిక శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు కేటాయించాలనే ఈ చట్ట నిబంధనను ఖాతరు చేస్తున్న వారు కనిపించడం లేదు. అడ్డంగా చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలను నియంత్రించే సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో చట్టం అమలు అభాసుపాలు అవుతున్నది. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కాకపోవడం వల్ల దేశంలో 6 కోట్ల మంది పిల్లలు పాఠశాల మొహమే చూడడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యా హక్కు చట్టం అమలులోని సాధకబాధకాలను సమీక్షించాల్సిన తరుణమిది. సమాజంలో కొంత మంది పిల్లలు బడి బయట ఉండడం, బాల కార్మికులుగా పనుల్లో, కారా?నాల్లో, గనుల్లో పని చేయడం వారి ప్రవేశానికి పాఠశాల నియమ నిబంధనలు అడ్డంకి రావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక హక్కుగా మారిన విద్యను పిల్లలు అందరూ పొందడానికి 'ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల చట్టం -2009' అనే చట్టం ఏప్రిల్ 1, 2010 నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చట్టం అమల్లోకి వచ్చిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ అప్పటి ప్రధాన మంత్రి మాట్లాడుతూ జాతి, మత, కులాలకు అతీతంగా దేశ బాలలందరినీ బడిలో చేర్పించి నాణ్యమైన విద్యను చట్టం ద్వారా అందిస్తామని అన్నారు. కానీ నేటికీ చట్టం ప్రధాన ఉద్దేశం నెరవేరలేదు.

చట్టం సక్రమంగా అమలు కావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో 6% నిధులను విద్యాభివృద్ధికి కేటాయించాలి. అరకొర కేటాయింపులతో అద్భుత ఫలితాలు సాధించడం సాధ్యం కాదనే విషయాన్ని గతం లో సుప్రీం కోర్టు తేల్చి చెప్పినా కూడా ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కేటాయిస్తున్న నిధులు పేలవం గా ఉంటున్నాయి. నేటికీ ప్రాథమిక పాఠశాల లేని గ్రామాలు, మౌలిక సదుపాయాలు లేమి, ఉపాధ్యాయుల కొరతతో విద్యా రంగం దురవస్థలపాలు అవుతున్నది. కరోనా కాలంలో దేశంలో 92 లక్షల మంది బాలబాలికలు బడికి దూరం అయ్యారని పలు గణాంకాలు విశ్లేషణ చేస్తున్నాయి. అలాగే వందకు పాతిక శాతం బాలబాలికలు ఐదో తరగతిలోనే బడిమానివేస్తున్నట్లు మన రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ చట్టం అమల్లో భాగంగా బడి ముఖం చూడని పిల్లలకు పాఠశాలలో చేర్పించేందుకు ఉద్దేశించిన పథకం సమగ్ర శిక్ష అభియాన్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎందుకు కొరగానిదిగా మారింది. విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 ప్రకారం దేశంలోని ప్రతి కార్పొరేట్, ప్రవేట్ పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ఇందులో భాగంగా వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు 5 శాతం, ఎస్‌సి బాలలకు 10%, గిరిజన బాలలకు 4%, వెనుకబడిన వర్గాల పిల్లలకు 6% సీట్లను ఉచితంగా కేటాయించాలి. కానీ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో కనీసం 10 శాతం పాఠశాలలు కూడా ఈ చట్టం నిబంధనలను పాటించడం లేదు. అలాగే సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో వివిధ పాఠశాలల్లో పిల్లల ఎంపిక కొరకు ఎలాంటి ఎంట్రన్స్‌లను నిర్వహించకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తూ మన రాష్ట్రంలో గురుకుల, ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కోసం ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం కోసం ఎలాంటి క్యాపిటేషన్ రుసుములు తీసుకోకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు బేఖాతరు చేస్తూ డొనేషన్, అడ్మిషన్ ఫీజులను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్నాయి. అలాగే సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నడపరాదు. అలా నడిపితే ఈ చట్టం నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేయవచ్చు. కానీ చాలా గ్రామీణ ప్రాంతాలలో, మారుమూల ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలలు నెలకొల్పుతూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను నడుపుతున్నారు. దీనిపై ప్రభుత్వాల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టం సత్ఫలితాలను ఇవ్వాలంటే విద్యా హక్కు చట్టం సెక్షన్ 25 ప్రకారం మొదట పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. ప్రస్తుతం దేశంలో 9 లక్షల ఉపాధ్యాయ పోస్టులు, అలాగే రాష్ట్రంలో దాదాపుగా 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యా హక్కు చట్టం నిబంధనలకు అనుగుణంగా వాటిని వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. పనుల్లో, గనుల్లో, కారా?నాల్లో కర్మాగారాల్లో పని చేస్తున్న బాలకార్మికులను ఆపరేషన్ స్మైల్ వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు గుర్తిస్తూ బడి ఈడు పిల్లలందరూ బడిలో కొనసాగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పిల్లల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా పాఠశాల విద్య ఉండాలి. అలాగే నిష్ఠ వంటి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయ విద్యను మరింత అభివృద్ధిపరచాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం ఏకతాటిపై నిలిచి మొక్కవోని దీక్షతో కృషి చేస్తే విద్యా హక్కు చట్టం లక్ష్యాలు నెరవేరుతాయి.

# పుట్టపర్తి నియోజకవర్గంలో వైసిపికి భారీదెబ్బ

**ఆమడ గూరు మండలంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర, పల్లే కృష్ణ కిషోర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 100 వైసీపీ కుటుంబాలు**

**– 193 చెరువులు నింపేది వైసీపీ ఎమ్మెల్యే బూటకమే**



**పుట్టపర్తి:** పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు నింపాలనే వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ప్రజలకు చెబుతున్న మాటలు ఒట్టి భూటకమని పుట్టపర్తి టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, యువ నేత పల్లె క్రిష్ణ కిషోర్ రెడ్డి లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన దుర్మార్గుడు వైసీపీ అధినేత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కోరారు. ఆమడగూరు మండల కేంద్రంలోనీ చౌడేశ్వరి కళ్యాణ మండపం లో నిర్వహించిన జయహో బిసి సమావేశంలో వారు ఈ సందర్భంగా మాట్లాడారు. అంతకు ముందు మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీలో గా పుర వీధుల్లో తిరుగుతూ టీడీపీ సింబల్ విక్టరీ చూపిస్తూ ప్రజలకు అభివాదం చేశారు.పుట్టపర్తి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డికి ప్రజలు పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాల వారికి స్వాగతం పలికి యువతీ యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల మధ్య పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చారు. పుర వీధుల్లో పూల వర్షం కురవడంతో పసుపు మయంగా మారింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నుంచి 100 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలోకి చేరారు వారికి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పల్లె సింధూర,పల్లే కృష్ణ కిషోర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పత్తి చంద్రశేఖర్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పేదల సంక్షేమం కోసం మంజూరైన పించన్ల డబ్బులు కూడా జగన్ రెడ్డి స్వంతానికి వాడేసి ఖజానా ఖాళీ చెసారని ఇలాంటి ఘనుడు ముఖ్యమంత్రి ఏపీ కి అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేసే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే బాగుంటుందని అన్నారు.అందుకే ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఉమ్మడిఅభ్యర్థి పల్లె సింధూర రెడ్డిని ,హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పార్థసారథినీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. 2019 ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గంలో ఉన్న 193 చెరువులకు నీళ్లు ఇచ్చిన తర్వాతనే మళ్ళీ ఓట్లు అడుగుతామని చెప్పిన వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి కి చెరువులు నింపాలని ఆలోచన ఇప్పుడు వచ్చిందని ,ఓట్లు కోసం డ్రామా అడే వైసీపీ ఎమ్మెల్యే ఈ ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యే చేతకానితనంతోనే 193 చెరువులకు హంద్రీనీవా నీళ్లు తీసుకరాలేక పోయారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఈ చెరువులకు హంద్రీ నీవా జలాలు తీసుకురావడానికి డి పి అర్ ప్రాజెక్టు కు రూ.3.40 కోట్లు బడ్జెట్ విడుదల చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రజలను పట్టి పీడించిన ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మళ్ళీ పుట్టపర్తి నియోజకవర్గంలో గెలిపించుకుంటే ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న దురదృష్టకరమని అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఉమ్మడి అభ్యర్థి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు కోరారు.

# నిరుపేద ముస్లిం సోదరీమణులకు నిత్యవసర సరుకులు పంపిణీ



భువనగిరి: భువనగిరి పార్లమెంట్ పరిధిలోని మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్లో లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం సోదరీమణులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ , కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, , భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నిత్యవసర సరుకులు పంపిణీ చేసారు..కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. యువకుడు అంచలంచలుగా ఎదిగి గత 15 సంవత్సరాలుగా ఎన్నో ఏళ్లుగా ఔజఎ యూత్ కాంగ్రెస్ నాయకుడుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్న, యువకుడు పోరాట శీలి నిత్య కృషివలుడు మృదుస్వభావి , తను చేసిన సేవ కార్యక్రమాలను చూసి అధిష్టానం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించింది, అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ హర్షిస్తున్నాను, ఈరోజు యువకునికి టికెట్ ఇచ్చింది, మనఅందరం కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకోవాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది, తెలంగాణ ఇచ్చిన తర్వాత ఇప్పుడు అధికారంలోకి వచ్చాము పేదలకు న్యాయం చేయాలి అనే లక్ష్యంతో 6 గ్యారెంటీ ల స్కీంతో పేదల కోసం రైతుల కోసం యువకుల కోసం మహిళల కోసం స్కీములు విడతలవారీగా అమలు చేస్తూ వస్తుంది, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరూ కూడా యువకుడు మన చామల కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని మి అందర్నీ అభ్యర్థిస్తున్నాను, నా అభిమానులందరికీ భువనగిరి పార్లమెంట్ ప్రజానీకానికి, కాంగ్రెస్ కార్యకర్తలకు నాయకులకు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ని గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకోవాలని కోరుతున్న.. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక సామాన్యుడు అయినటువంటి నేను యువజన కాంగ్రెస్ నుంచి ఈరోజు కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నుకోవడం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం ఒక కార్యకర్తగా నాకు అవకాశం ఇచ్చినటువంటి పరిస్థితి ,అలాగే ఈ పార్లమెంటుకు సంబంధించినటువంటి నాయకులు కోమటిరెడ్డి బ్రదర్స్ ఆశీర్వాదంతో మిగతా ఎమ్మెల్యేలు అందరి ఆశీర్వాదంతో ఈ నిర్ణయం తీసుకుంది, మున్న జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో బూతు స్థాయి నుండి కార్యకర్తల నాయకులు వరకు పనిచేసే అత్యధిక మెజార్టీతో గెలిపించారు, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తన్ని తరిమి కొట్టడం జరిగింది.. రెండు లక్షల 50 వేల మెజార్టీతో ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం జరిగింది మళ్లీ ఒక్కోసారి పార్లమెంట్ ఎన్నికలలో అదే ఉత్సాహంతో అదే విధానాలతో పనిచేసి తెలంగాణ లోనే అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలిపించుకొని ఢిల్లీకి పంపించవలసిన అవసరం ఉంది. సోనియా గాంధీ గారు 2014లో తెలంగాణ రాష్ట్రనీ ఇచ్చారు ఏదైతే బంగారు తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు తెచ్చుకున్నాము,కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏండ్లు తుంగలో తొక్కింది, ఈ 100 రోజుల్లో మన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు ,మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ కూడా ఇచ్చిన గ్యారెంటీలను వీలైనంతవరకు అమలు చేస్తున్నారు, కొని పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి, ఈ వంద రోజుల్లో ఏదో కరువు వచ్చినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు ప్రజలన్నీ గమనిస్తున్నారు అని, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచిన తర్వాత ఇక్కడున్న శాసనసభ్యులు ప్రభుత్వం ఒకే ఒక లక్ష్యంతో మేమందరం పనిచేస్తుంది తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కల నెరవేర్చాలి అందరి జీవితాల్లో వెలుగు నింపాలి, భువనగిరి పార్లమెంట్ ప్రజలందరూ నన్ను ఆశీర్వదించి గెలిపిస్తారని కోరుతున్న అని అన్నారు.

## ఆధ్యాత్మిక సమైక్యత కోసం అన్నమయ్య కీర్తనలు: ఆచార్య సర్వోత్తమరావు

**తిరుపతి:** ఆనాటి రాజకీయ కాలమాన పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తిభావాన్ని చైతన్య పరిచి ఆధ్యాత్మిక సమైక్యత సాధించేందుకు శ్రీవేంకటేశ్వరస్వామివారిని కేంద్రంగా చేసుకుని అన్నమయ్య సంకీర్తనలు రచించి వ్యాప్తి చేశారని ఎస్వీ యూనివర్శిటి విశ్రాంత ఆచార్యులు సర్వోత్తమరావు పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి ఉత్సవాలు తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సోమవారం ఘనంగా ముగిశాయి.

ఈ సందర్భంగా జరిగిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య సర్వోత్తమరావు "అన్నమయ్య - ప్రభోదము " అనే అంశంపై ఉపన్యసించారు శ్రీ వేంకటేశ్వరుని నామంతో విశేషాలు, ఉత్సవాలతో భక్తజనానికి వీనులవిందుగా అన్నమయ్య కీర్తనలు రచించినట్లు తెలిపారు. స్వామివారి రూపాన్ని కళ్లకు కట్టేలా అన్నమయ్య సాహిత్యం ఉంటుందన్నారు. అన్నమయ్య సంకీర్తనల్లో సాహిత్యంతో పాటు సంగీతానికి విశేష ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. హైదరాబాద్ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య భూమయ్య "అన్నమయ్య - ఆధ్యాత్మికత " అనే అంశంపై ఉపన్యసించారు యావత్ భక్తి సాహిత్యంలో అన్నమయ్యకు ప్రత్యేకమైన స్థానం ఉందని, వారి సంకీర్తనల్లో నవవిధ భక్తి మార్గాలను తెలియజేశారన్నారు. ఈ కీర్తనల్లో వేదాలు, రామాయణ, మహాభారతాలు, ఉపనిషత్తులు, పురాణాల్లోని అంశాలను అన్నమయ్య స్పృశించారని తెలిపారు. అన్నమయ్య బ్రహ్మ స్వరూపమని, ఆయన అనుసరించింది బ్రహ్మమార్గమని తెలియజేశారు. శ్రీవారిపై భక్తి ద్వారా అన్నమయ్య సంపూర్ణ మానవజీవనాన్ని చవిచూశారని తెలిపారు. తిరుపతి చెందిన శ్రీ జిడి నాయుడు "అన్నమయ్య - అలమేలుమంగ శతకం" అనే అంశంపై ఉపన్యసించారు, అన్నమయ్య తన సంకీర్తనల్లో శృంగార, భక్తి, కవితా విశేషాలను గురించి వివరించారు.

# 3 నెలల పాటు వరంగల్, కరీంనగర్ రోడ్డు బంద్

వరంగల్: వరదలకు ప్రధాన కారణమైన నయీంనగర్ నాలా విస్తరణ, బ్రిడ్జి పునః నిర్మాణ పనులు షురూ అయ్యాయి. బ్రిడ్జి నిర్మాణ పనుల వల్ల కరీంనగర్ ? వరంగల్ మధ్య ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. మూడు నెలల పాటు వాహనాలు దారి మళ్లిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్ళాలని సూచిస్తున్నారు.ప్రస్తుత వాహనాల సంఖ్య క్రమంగా పెరిగింది. గతంలో కట్టిన బ్రిడ్జి రాకపోకలకు సరిపోని పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతేగాక ప్రతి వర్షాకాలంలో వరద నీటి ప్రవాహానికి ముంపునకు గురవుతోంది. దీంతోనే కొత్త బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నయీంనగర్ వద్ద రూ.8.5 కోట్లతో పాత బ్రిడ్జి కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం. ఇటీవలె మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. జూన్ నెలలో వచ్చే వర్షాకాలం దృష్ట్యా.. ఆలోగానే కొత్త బ్రిడ్జి పనులు పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేశారు.వరంగల్ నుండి కరీంనగర్ వెళ్ళాలంటే హనుమకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్, నయీంనగర్, కేయూ జంక్షన్ మీదుగా వెళ్ళాలి. ప్రస్తుతం నయీంనగర్ బ్రిడ్జి పునః నిర్మాణ పనులు జరుగున్నాయి. బ్రిడ్జి కూల్చివేత సందర్భంగా ఈ రహదారి మొత్తం మూసివేశారు అధికారులు. మూడు నెలల పాటు ఈ ప్రధాన రహదారి మూసి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మూడు నెలలు వాహనాల దారి మళ్లింపు ఉంటుందని వెల్లడించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనదారులు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.కరీంనగర్ నుండి ఖమ్మం, నర్సంపేట, వరంగల్ వైపుకు వెళ్లవలసిన భారీ వాహనాలు కేయూ జంక్షన్ నుండి పెగడపల్లిడబ్బాల, పెద్దమ్మ గడ్డ, ఆటోనగర్, మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కరీంనగర్ నుండి వచ్చే ఖీఅ బస్సులు కేయూ జంక్షన్ నుండి పెగడపల్లిడబ్బాల, పెద్దమ్మ గడ్డ, ములుగు రోడ్డు జంక్షన్, అమృత జంక్షన్, హన్మకొండ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు చేరుకునేలా రూట్ మ్యాప్ ప్రకటించారు ట్రాఫిక్ సిబ్బంది.ఖమ్మం నుండి వరంగల్ మీదుగా కరీంనగర్ వైపు వెళ్లవలసిన భారీ వాహనాలు ఉరుసుగుట్ట, కడిపికొండ, మడికొండ, రాఖీఖీ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వరంగల్, నర్సంపేట వైపు నుండి కరీంనగర్ వైపుకు వెళ్లవలసిన భారీ వాహనాలు ఓఉఓ సర్కిల్, ములుగు రోడ్డు జంక్షన్, పెద్దమ్మ గడ్డ, పెగడపల్లిడబ్బాల, కేయుసి జంక్షన్ మీదుగా వెళ్లాలని అధికారులు తెలిపారు. హన్మకొండ నుండి కరీంనగర్ వైపు వెళ్ళు ఖీఅ బస్సులు హన్మకొండ చౌరస్తా, అమృత జంక్షన్, ములుగు రోడ్డు జంక్షన్, పెద్దమ్మ గడ్డ, పెగడపల్లిడబ్బాల, కేయూ జంక్షన్ మీదుగా వెళ్లేలా ట్రాఫిక్ డైవర్ట్ చేస్తున్నారు.వచ్చే వర్షాకాలం వరకు ఓరుగల్లు ప్రజలకు పూర్తిగా వరద ముప్పు నుండి విముక్తి కల్పించే లక్ష్యంతో పనులు చేపట్టారు అధికారులు. అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్రజలు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా ఉన్నతాదికారలు కోరారు.

# బస్తర్ ల మోడీ భారీ సమావేశం

రాయ్ పూర్: మావోయిస్టుల కంచుకోట బస్తరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోదీ. చత్తీస్‌గడ్‌లో గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొమ్మును లూటీ చేసిందని ఆరోపించారు మోదీ. తాను అవినీతిపై యుద్ధం ప్రకటిస్తే విపక్షాలు మోదీ గ్యారంటీలపై విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా అవినీతిని అంతం చేస్తానని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన విజయ్ సంకల్ప్ శంఖనాద్ మహార్యాలీలో ప్రసంగించిన ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. పేదల గురించి కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలు పేదల హక్కులను లాక్కున్నారని ఆరోపించారు. పేదలకు హక్కులు కల్పించి సగౌర్వంగా జీవించేలా చేశామన్నారు. ప్రస్తుతం దేశం మొత్తం మరోసారి మోదీ సర్కార్ అంటున్నారు. దేశంలోని ప్రతి పేదవాడికి నేను అండగా ఉంటానని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు..బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఒక్కొక్కటిగా పథకాలు తీసుకువచ్చి వారి హక్కులను కల్పించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి ఫలితంగానే దేశంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. పేదవారి ప్రతి ఆందోళనను తొలగించే వరకు విశ్రమించనని నిర్ణయించుకున్నానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభించామన్నారు. ఆయుష్మాన్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. దశాబ్దాల తర్వాత దేశం సుస్థిరమైన, బలమైన బీజేపీ ప్రభుత్వాన్ని చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పేదల సంక్షేమవే మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. స్వాతంత్ర్యానంతరం పేదల అవసరాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదల గురించి పట్టించుకోలేదు, వారి సమస్యలను అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ కుటుంబంలోని ధనవంతులకు ద్రవ్యోల్బణం అంటే అర్థం కాలేదన్నార ప్రధాని మోదీ. పేదలకు ఉచితంగా రేషన్, వ్యాక్సిన్ ఇచ్చామని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కాలాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రజలు భారతదేశం ఎలా మనుగడ సాగిస్తుందని చెప్పేవారు? కాంగ్రెస్ హయాంలో దేశంలో వ్యాక్సిన్ రావడానికి దశాబ్దాలు పట్టేది. భారత దేశంలోని ప్రతి పేదవాడికి అండగా ఉంటానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. పేదలకు ఉచితంగా వ్యాక్సిన్, ఉచితంగా రేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. 2014కి ముందు లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీ నుంచి ఒక్క రూపాయి వస్తే, అదీ గ్రామాలకు 15 పైసలు మాత్రమే వచ్చేవి. మిగిలిన 85 పైసలను కాంగ్రెస్ వారే కొల్లగొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ దోచుకునే ఈ వ్యవస్థను ఆపానని స్పష్టం చేశారు మోదీ. అవినీతిపరుల నల్లధనాన్ని అడ్డుకున్నానని, . బీజేపీ ప్రభుత్వం తన పదేళ్లలో రూ.34 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పంపించినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

---

# ప్రజలకు మంచి చేసే వైఎస్సార్సీపీ కే ఓటు వేయండి

## - ఎమ్మిగనూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



**ఎమ్మిగనూరు:** పట్టణం లో 16 వ వార్డ్ లో ఎన్నికల ప్రచారం లో రాబోయే ఎన్నికలలో ప్రజలకు మంచి చేసే వైఎస్సార్సీపీకే ఓటు వేయాలని ఎమ్మిగనూరు వైఎస్సార్సీపీ అభ్యర్థి బుట్టా రేణుక కోరారు. సోమవారం ఉదయం ఎమ్మిగనూరు పట్టణం లో నీ 16 వ వార్డ్ కౌన్సిలర్ వాహీద్, పార్టీ శ్రేణులుతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించగా.. వార్డ్ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వార్డ్ ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కి వార్డ్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంక్షేమ పథకాలను దళారులు లేకుండా నేరుగా చేరవేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఆపదలో ఉన్నవారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎనికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి తనను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా, కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారం లో బుట్టా శివ నీలకంఠ , వార్డ్ నాయకులు బజారిరెడ్డి, జిక్రియ, ఖలీల్, గోవిందు, ఖాదర్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, పట్టణ ప్రతినిధి సునీల్ కుమార్, వక్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్,మున్సిపల్ కో ఆప్షన్ మెంబెర్ కొండాపూరి అబ్రార్, కౌన్సిలర్లు కాశీం బేగ్,రాజారత్నం,డిష్ కేశవరెడ్డి,సుధాకర్,ఇన్చార్జులు రామాంజి రెడ్డి, గట్టు ఖజా, నాయకులు ఖిబులా హుస్సేని,ఇళయకత్,కే.యమ్ బాషా,యూసుఫ్, మంజునాథ్,బుట్టా యూత్ నాయకులు ఫయాజ, ఉబెద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# కల్పవృక్ష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి కటాక్షం

తిరుపతి: తిరుపతి శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రకృతికి శోభను సమకూర్చేది చెట్టు. అనేక విధాలైన వృక్షాలు సృష్టిలో ఉన్నాయి. అందులో మేటి కల్పవృక్షం. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని స్వామివారు అధిరోహించారు. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.

---

# దళితుల్లోనూ.. ఇంత వివక్షా?

రాజ్యాధికారం దక్కని కులాలు అంతరించిపోతాయని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే చెప్పిన మాటలు ఎప్పటికి అక్షర సత్యమే . అట్టడుగు వర్గాలకు సైతం రాజ్యాధికారం దక్కాలనే ఉద్దేశంతో ఆయన దేశ పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాడు. రాజ్యాంగ రక్షణతో పాటు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారు. కానీ ఈ వర్గాల్లో కూడా నేటికీ అసమానతలు ఎదుర్కొంటున్నారు. భారత రాజ్యాంగం దళిత వర్గాలకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, ఈ వర్గాల్లో కూడా నేటికీ అసమానతలు ఎదుర్కొంటున్నారు. అందరం దళితులమేనన్న నెపంతో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండి నేటి వరకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో షెడ్యూల్డ్ కులాల్లో మాల మాదిగ కులాలే లబ్ది పొంది మిగతా కులాలు అణగదొక్కబడ్డాయి. ఇదే పలు కేంద్ర నివేదికలు సైతం రుజువు చేశాయి. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో మూడు ఎస్సీ రిజర్వేషన్ స్థానాల్లో ఇంతకాలం అన్యాయానికి గురైన ఉపకులాలను విస్మరించి, ఇన్నేళ్లుగా అధికారాన్ని అనుభవించిన మాల, మాదిగ కులాలే మాకంటే మాకు అన్యాయం జరిగిందని మాకే మొత్తం ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని పోరాడుతుండడాన్ని చూస్తే విస్మయం కలుగకమానదు. మళ్ళీ వీరే బహుజన రాజ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నమంటారు. ఇదేం న్యాయం?

2011 అధికారిక లెక్కల ప్రకారం, తెలంగాణ రాష్ట్ర జనాభా 3,63,37,160 కోట్లు. ఇందులో షెడ్యూల్డ్ కులాల జనాభా 63,60,158 లక్షలు అంటే రాష్ట్ర జనాభాలో 17. 50 శాతం. దళితుల్లో మాదిగలు 25,09,992 లక్షలు అంటే 39 శాతం, రాష్ట్ర జనాభాలో 6.9 శాతం. మాలలు 17,05,448 లక్షలు అంటే 27 శాతం, రాష్ట్ర జనాభాలో 4.6 శాతం. ఇక ఇందులోనే అత్యంత వెనుకబడ్డ కులాల( ఉప కులాలు) జనాభా 21,44,718 లక్షలు. అనగా దళిత జనాభాలో వీరు 34 శాతం రాష్ట్ర జనాభాలో 5.9 శాతం మేర ఉన్నారు. ఇక్కడ మరొక అన్యాయం ఏమిటంటే మాల, మాదిగలకు కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ఇస్తే ఉపకులాలకు మాత్రం ఆర్డీవో ద్వారా ఇస్తారు. దీనివల్ల ఉపకులాల ప్రజలు అధికారుల ఇబ్బందులకు తాళలేక లక్షలాది మంది ఉపకులాల ప్రజలు మాల, మాదిగ కుల పత్రాలు పొందడం వల్ల ఈ రెండు కులాల జనాభా అధికారిక లెక్కల్లో పెరిగింది. కానీ వాస్తవ జనాభా వీరికంటే ఎక్కువగా ఉంటుంది. అందుకే దళితుల్లో కులగణన చేయాలని ఎప్పటినుండో డిమాండ్ చేస్తున్నాం.

ఇక రాజకీయ అవకాశాల విషయానికొస్తే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 42 ఎంపీ స్థానాలు గానూ, 7 ఎస్సీ రిజర్వుడు, 294 ఎమ్మెల్యే స్థానాలలో 48 స్థానాలు రిజర్వుడు. వీటిని అధిక శాతంమాలలు దక్కించుకోగా, మాదిగలు ద్వితీయ స్థానంలో వినియోగించుకున్నారు. ఆనాటికి ఉపకులాల ఊసేలేదు. రాష్ట్ర విభజన తర్వాత మన తెలంగాణా రాష్ట్రంలో ఉన్న 119 అసెంబ్లీ స్థానాలలో 19 ఎస్సీ రిజర్వుడు కాగా,17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో 3 స్థానాలు దళితులకు కేటాయించబడ్డాయి. ఈ మూడు స్థానాలలో అనేక దశాబ్దాలుగా పెద్దపల్లి నియోజకవర్గంలో మాల సామాజిక వర్గానికి చెందిన గుడిసెల వెంకటస్వామి కుటుంబం, నాగర్ కర్నూల్ నుంచి మాదిగ సామాజిక వర్గం నుండి మంద జగన్నాథం, కంటోన్మెంట్ సికింద్రాబాద్ నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన నంది ఎల్లయ్య గార్లు ప్రాతినిధ్యం వహించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత వరంగల్ పార్లమెంటు ఎస్సీ నియోజకవర్గం ఏర్పడింది ఇక్కడ నుండి కూడా ఎక్కువ మాదిగలే ప్రాతినిధ్యం వహించారు.

ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లోని, అసెంబ్లీ స్థానాలలో ఎస్సీ ఉప కులాల సంఖ్య నిర్ణయాత్మక శక్తిగా ఉంటుంది. 2018 పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ జనాభా అధికంగా ఉన్న అందులోనూ ఉపకులాల సంఖ్య అధికంగా ఉన్న పెద్దపల్లి నియోజకవర్గంలో మొదటిసారిగా ఎస్సీ ఉపకులమైన నేతకానీ కులానికి చెందిన బోర్లకుంట వెంకటేష్ నేతకు పార్లమెంట్ సభ్యునిగా అవకాశం లభించింది. కానీ ఆ పరిస్థితి నేడు లేదు. అందుకే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మూడు ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో సామాజిక న్యాయ ప్రకారంగా ఒక స్థానం మాదిగలకు రెండవ స్థానం మాలలకు మూడవ స్థానం ఉప కులాలకు దక్కాలి. కానీ మాల మాదిగ కులాలకు చెందిన వారే మాకు అన్యాయం జరిగిందంటే మాకన్యాయం జరిగిందని వాదులాడుకుంటూ మా ఎస్సీ ఉపకులాలకు అవకాశం రాకుండా గొంతు నొక్కుతున్నారు. పైగా దళితులకు రిజర్వ్ చేయబడ్డ 19 అసెంబ్లీ స్థానాలలో పది స్థానాల్లో మాదిగలు ప్రాతినిధ్యం వహిస్తుండగా మిగతా తొమ్మిది స్థానాలలో మాలలు అధికారాన్ని అనుభవిస్తున్నారు. కానీ సామాజిక న్యాయం, జనాభా దామాషా ప్రకారం వెనుకబడ్డ దళిత ఉపకులాలకు ఆరు స్థానాలు దక్కాల్సి ఉండగా ఎక్కడా అవకాశమివ్వలేదు. ఒకవైపు మాలల వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మిగతా వెనుకబడ్డ దళిత కులాల కోసం వర్గీకరణ చేయాలని మాదిగ దండోర పేరుతో ఒక వర్గం ఉద్యమిస్తుంటే, ఎస్సీలను వర్గీకరించొద్దని మాల మహానాడు పేరుతో మరొక వర్గం ఉద్యమాలు చేస్తూ ఈ రెండు కులాలు ప్రభుత్వాల ఆధిపత్యం చెలాయిస్తూ మిగతా 57 కులాలను ఎదగనివ్వకుండా అణచివేస్తున్నారు. సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్ర మంత్రుల వరకు ఈ రెండు కులాలే దళితుల ప్రయోజనాలు అనుభవిస్తున్నారు. నాటి నుండి నేటి వరకు దళితుల్లో వెనుకబాటులో ఉంచబడ్డ ఈ కులాల పేర్లు బయటకు తెలియకుండా, ఈ కులాల సమస్యలు పరిష్కరించకుండా వీరికి మాదిగ ఉపకులాలు, మాలఉపకులాలనే ముద్ర వేసి వీరందరి ప్రయోజనాలు రెండు కులాలే పొందుతుండడం అన్యాయం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఈ నాటికి ఈ కులాల వారికి కనీసం నామినేటెడ్ పదవులు సైతం దక్కలేదు. ప్రభుత్వ పథకాలలో ఒక్క శాతం కూడా ఈ కులాలకు అందలేదు. ఈ కులాలన్నీ కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోయాయి. దళితుల్లోనే ఇంత వివక్ష, ఆధిపత్యం ఉంటే ఇక రిజర్వేషన్లు ఎవరికోసమో ఆలోచించాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచించి ఈ వివక్షతను కొనసాగించకుండా వెనుకబడ్డ దళిత కులాల వృత్తులు సాంప్రదాయాలను పరిరక్షించడం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పరచాలి. ఈ కులాలను ఉపకులాలుగా కాకుండా అత్యత వెనుకడిన షెడ్యూల్డ్ క్యాస్ట్స్‌గా గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, నామినేటెడ్ ఎమ్మెల్సీ, ఎంపీ స్థానాలను కేటాయించాలి. ఈ కులాలకు శాశ్వత న్యాయం చేకూర్చడానికి ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాల మాదిగ కులాలతో సంబంధం లేకుండా ఈ కులాలన్నింటిని 'ఏ' వర్గంలో చేర్చి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలి. ఇప్పటివరకు అధికారాన్ని అనుభవించిన కులాలు రిజర్వుడు స్థానాలను వదిలి ఇంతవరకు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించని కులాలకు అవకాశం కల్పించి తాము మాత్రం జనరల్ స్థానాల్లో పోటీ చేస్తే అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం జరుగుతుంది.

---

# అసమాన శిల్పి గణపతి స్థపతి

మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారు...1962లో విడుదలైన మంచి మనసులు చిత్రంలో, ఆచార్య ఆత్రేయ సాహిత్యం అందించిందిన, పాటకి కె.వి.మహదేవన్ అద్భుతమైన సంగీతం అందించిన, అమర గాయకుడు ఘంటసాల పాడిన పాట గుర్తుకు రాగానే విజయనగర సామ్రాజ్య శిల్పకళకు నెలవైన హంపిలో చిత్రీకరించిన చిత్రాలు కళ్లముందు సజీవంగా సాక్షాత్కా రిస్తాయి. అలాగే అమర శిల్పి జక్కన్న కళ్ళముందు కదలడం అత్యంత సహజం. ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళ కు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్ఫురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళ్లమూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు. గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 – 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది.

1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాథ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978%--%89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరించారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివాలయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడించి, కొత్త ఒరవడిని సృష్టించారు. ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు.

విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి. వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శుభాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

---

# పద కవితా పితామహుడు - అన్నమాచార్యుడు


దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు. అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 – ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉండగా, నారాయణ సూరి – లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు.

# సాక్షులకు పోలీసుల తర్ఫీదు దిగ్భ్రాంతికరం



న్యూఢిల్లీ: హత్యానేరం కేసులో సాక్షులకు పోలీస్‌స్టేషన్‌లో తర్ఫీదు ఇవ్వడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీస్ అధికారుల చర్య దిగ్భ్రాంతికరమని జస్టిస్ అభయ్ ఎస్. ఓక్, జస్టిస్ పంకజ్ మిత్తల్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం పేర్కొంది. దీనిపై దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తమిళనాడు డీజీపీని ఆదేశించింది. హత్య కేసులో ఇద్దరు నిందితులను దోషులుగా తేల్చి జీవిత ఖైదు విధించిన దిగువ న్యాయస్థానాల తీర్పును కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పోలీసులు తమకు కావలసిన విధంగా సాక్షులకు తర్ఫీదునిచ్చిన విషయాన్ని ట్రయల్ కోర్టు, హైకోర్టు గుర్తించలేకపోవడం విస్మయపరిచిందని పేర్కొంది. కోర్టులో ఎలా చెప్పాలో ముందుగానే సాక్షులకు పోలీసులు శిక్షణ ఇవ్వడం అధికారాన్ని దుర్వినియోగం చేయడమేనని, న్యాయప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని అభిప్రాయపడింది. అటువంటి సాక్ష్యాలు చెల్లబోమని స్పష్టం చేసింది. అసలైన సాక్షులను వదిలేసి, పోలీసులు సిద్ధం చేసిన వారిని కోర్టులో ప్రశ్నించారని పేర్కొంది. 2007 అక్టోబరు 4న బాలమురుగన్ అనే వ్యక్తిని మణికందన్, శివకుమార్ హత్య చేశారంటూ కేసు నమోదైంది. బాలమురుగన్ ఇంటి వద్ద జరిగిన ఘర్షణలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# పాక్‌కు రక్షణమంత్రి స్ట్రాంగ్ వార్నింగ్



న్యూఢిల్లీ: పాకిస్థాన్ లో ఉగ్రవాదుల మిస్టరీ మరణాల వెనుక భారత్ హస్తం ఉందంటూ యూకే మీడియా రాసిన కథనంపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. దేశ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఉగ్రవాదులను ప్రభుత్వం విడిచిపెట్టదని తేల్చిచెప్పారు. జాతీయ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం వైఖరిని స్పష్టం చేశారు. "దేశంలో శాంతికి విఘాతం కలిగించేందుకు ఏ ఉగ్రవాది అయినా ప్రయత్నిస్తే.. తగిన సమాధానం చెప్తాం. ఒకవేళ వారు పాకిస్థాన్‌కు పారిపోయినా వదలం. అక్కడికి వెళ్లి మరీ మట్టుపెడతాం. ప్రధాని మోదీ చెప్పింది అక్షరాలా నిజం. భారత్ శక్తిని పాకిస్థాన్ అర్థం చేసుకోవడం ప్రారంభించింది. అలాగే భారత్ ఎప్పుడూ ఏ దేశంపై దాడి చేయదు. వారి భూభాగాలను ఆక్రమించేందుకు యత్నించదు. తన పొరుగుదేశాలతో సత్సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటుంది. ఎవరైనా అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే మాత్రం ఉపేక్షించదు" అని స్పష్టం చేశారు. బ్రిటన్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రిక భారత్‌పై ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసింది. 2019లో పుల్వామా ఘటన తర్వాత నుంచి దేశానికి ప్రమాదకరంగా మారుతున్న వ్యక్తులను న్యూదిల్లీ లక్ష్యంగా చేసుకొందని పేర్కొంది. భారత విదేశీ ఇంటెలిజెన్స్ సంస్థ 'రా' దాదాపు 20 హత్యలు చేసి ఉంటుందని ఆరోపించింది. భారత్, పాక్ ఇంటెలిజెన్స్ అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగానే కథనం రాసినట్లు పేర్కొంది. దీనిపై ఇప్పటికే మన విదేశాంగ శాఖ స్పందించింది. ఇది పూర్తిగా తప్పుడు సమాచారమని, భారత వ్యతిరేక ప్రచారమని పేర్కొంది. ఇతర దేశాల్లో లక్షిత హత్యలు భారత్ ప్రభుత్వ విధానం కాదని పునరుద్ఘాటించింది.

# ఢిల్లీ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ అధినేత, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసినప్పటికీ..ఆయన తిహాడ్ జైలు నుంచే పాలన సాగిస్తున్నారు. ఆయన రాజీనామా చేయాల్సివస్తే తర్వాత సీఎం ఎవరనే దానిపై ఇంతవరకు స్పష్టత రాలేదు. తాజాగా దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. సునీతా కేజ్రీవాల్ తనను తాను దిల్లీ సీఎం మెసెంజర్‌గా చెప్తుంటారని సౌరభ్ మీడియాతో అన్నారు. "కేజ్రీవాల్ పంపే సందేశాలను ఆమె వినిపిస్తున్నారు. అదంతా పార్టీ కార్యకర్తలు, మా మద్దతుదారులపై గొప్ప సానుకూల ప్రభావం చూపుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని ఐక్యంగా ఉంచేందుకు ఆమె బెస్ట్ పర్సన్" అని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పార్టీ తరఫున ప్రచారం చేస్తారా? అని అడగ్గా.."అదే జరిగితే మేం చాలా సంతోషిస్తాం. పాల్గొనాలా..? వద్దా..? అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం" అని పేర్కొన్నారు. అరెస్టు తర్వాత ఈడీ కస్టడీ, తిహాడ్ జైలు నుంచి కేజ్రీవాల్ పంపే సందేశాలను ఇప్పటివరకు సునీత పలుమార్లు వినిపించారు. వాటిద్వారా ప్రజలకు ఆయన ఆలోచనలను తెలియజేస్తున్నారు. ఇదిలాఉంటే.. ముఖ్యమంత్రి పదవికి సునీతతో పాటు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్ పేర్లు కూడా వినిపించాయి. ఈ క్రమంలోనే మద్యం కేసులో అరెస్టయిన మరో ఆప్ నేత సంజయ్ సింగ్ బెయిల్‌పై బయటకు వచ్చారు. వచ్చీ రాగానే కేజ్రీవాల్ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. సీనియర్ నేతల అరెస్టుల నేపథ్యంలో ఆయన పాత్ర కూడా కీలకంగా మారింది.

# సిఎఎను ఇప్పుడెందుకు అమలు చేస్తున్నారో చెప్పాలి



న్యూఢిల్లీ : దేశంలో పేదలు-ముస్లింలు లేకుండా చేయడమే బిజెపి లక్ష్యమని... సిఎఎను ఇప్పుడెందుకు అమలు చేస్తున్నారో చెప్పాలని పౌరసత్వ సవరణ చట్టం పై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. సిఎఎను ఎన్‌పిఆర్, ఎన్‌ఆర్‌సిలతో కలిపి చూడాలని అప్పుడే దాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలమన్నారు. లోక్‌సభలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడిన తీరు ఇప్పుడు రాజ్‌నాథ్ సింగ్ కామెంట్స్.. సిఎఎ పై కేంద్రం తీరు ఏంటో స్పష్టంగా తెలిసిపోతుందని చెప్పారు. ఈ దేశంలో పేదలు, దళితులు, మైనారిటీలు, ముస్లింలకు చోటు లేకుండా చేయడమే సిఎఎ, ఎన్‌పిఆర్, ఎన్‌ఆర్‌సి లక్ష్యమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక, ఎన్నికలు రాగానే సిఎఎ నిబంధనలు వస్తాయని బిజెపి పై ధ్వజమెత్తారు. పౌరసత్వ సవరణ చట్టంపై తమకు అభ్యంతరాలున్నాయని, మతం ఆధారంగా కాకుండా హింసకు గురైన వారికి ఆశ్రయం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి అసదుద్దీన్ సూచించారు. ఈ సిఎఎ నిబంధనలను గత ఐదేళ్లుగా ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు. సిఎఎ ఇప్పుడు ఎందుకు అమలు చేస్తున్నారో మోడీ సర్కార్ చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలే లక్ష్యంగా సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్ తెచ్చారని అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు.

# ఇజ్రాయిల్‌కు, అమెరికాకు ముప్పు తప్పదు



టెహ్రాన్ : సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయంపై దాడికి పాల్పడి సీనియర్ కమాండర్లతో సహా పలువురు సైనిక సలహాదారుల మృతికి కారణమైన ఘటనకు తప్పకుండా ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ జనరల్ హుస్సేన్ సలామీ ప్రతిన చేశారు. ఆ దాడిలో మృతి చెందినవారి అంత్యక్రియల సందర్భంగా వేలాదిమంది టెహరాన్ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. 'ఇజ్రాయిల్‌కు ముప్పు తప్పదు', అమెరికాకు ముప్పు తప్పదు' అని నినాదాలు చేశారు. టెహరాన్‌తో పాటూ పలు నగరాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ దాడిలో రివల్యూషనరీ గార్డ్స్‌కి చెందినవారు ఏడుగురితో సహా మొత్తం 13 మంది చనిపోయారు. టెహరాన్‌లో ప్రదర్శకులందరూ టెహరాన్ వర్సిటీ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ సలామీ ప్రసంగించారు. ఇజ్రాయిల్ జరిపిన ఈ దాడికి ప్రతీకారం తీర్చుకోకుండా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. కచ్చితంగా ఈ దాడికి బదులిస్తామన్నారు. నెతన్యాహు ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమన్నారు. అమెరికాను ప్రపంచం యావత్తూ ముఖ్యంగా ముస్లిం దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. 1979 ఇస్లామిక్ రివల్యూషన్ జరిగినప్పటి నుండి రంజాన్ పవిత్ర మాసం చివరి శుక్రవారం నాడు జెరూసలేం డే పేరుతో పాలస్తీనియన్లకు మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. ఈసారి మిలటరీ జనరల్స్ అంత్యక్రియలు కూడా ఇదే రోజుజరగడంతో పాలస్తీనాకు మద్దతుగా బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి. ఇరాన్ జనరల్స్ మృతదేహాలను తీసుకుని వెళుతున్న ట్రక్కు వెనక వేలాదిగా ఇరానియన్లు ప్రదర్శన నిర్వహించారు.

# కోవిడ్ కన్నా 100 రెట్లు ప్రాణాంతకం



కెనడా : కోవిడ్ మహమ్మారి కంటే ప్రాణాంతకమైన బర్డ్‌ఫ్లూ మానవాళిపై విరుచుకుపడే ప్రమాదం ఉన్నదని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. బర్డ్‌ఫ్లూలోని హెచ్5ఎన్1 రకం వైరస్ మహమ్మారిగా మారవచ్చని పేర్కొన్నారు. కెనడాకు చెందిన ఫార్మారంగ నిపుణులు జాన్ ఫౌల్టన్ కూడా బర్డ్‌ఫ్లూపై ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్5ఎన్1 వేరియంట్ మహమ్మారిగా మారవచ్చని, ఇది కోవిడ్ -19 కంటే 100 రెట్లు ప్రాణాంతకం కావొచ్చని తెలిపారు. అమెరికాలోని పిట్స్‌బర్గ్‌కు చెందిన బర్డ్‌ఫ్లూ పరిశోధకులు డాక్టర్ సురేశ్ కూచిపూడి మాట్లాడుతూ %ా% ఈ బర్డ్‌ఫ్లూకు మానవాళి చేరువవుతున్నదని, ఈ వైరస్ మనుషులతోపాటు జంతువులకు కూడా వ్యాపించవచ్చని అన్నారు. ఇదేదో కొత్తగా పుట్టుకొచ్చే వైరస్ కాదని, ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉన్నదేనని తెలిపారు. దీనిని ఎదుర్కొనేందుకు వెంటనే సిద్ధం కావాల్సి ఉందన్నారు.

# మోదీ నిరాశపరిస్తే గడ్కరీ సహాయం చేశారు:



సిమ్లా: భారీ వర్షాలతో అతలాకుతలమైన తమ రాష్ట్రానికి ప్రధాని మోదీ నుంచి ఆశించిన సహాయం అందలేదని హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ ప్రతిభా సింగ్ అన్నారు. అయితే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మాత్రం తమను ఆదుకున్నారని, రాష్ట్రంలో జాతీయ రహదారులకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించారని చెప్పారు."వర్షాకాలంలో హిమాచల్ ప్రదేశ్ భారీ ప్రకృతి విపత్తును ఎదుర్కొంది. ఆ సమయంలో కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం ఏమీ అందలేదు. అప్పుడు నేను ప్రధాని మోదీని కలిశాను. ఆర్థిక సహాయం చేయాలని అభ్యర్థించాను. ఇప్పటికే మీ ముఖ్యమంత్రి భేటీ అయ్యారని, సాధ్యమైనంత వరకు సహాయం అందుతుందని చెప్పారు. ఆ మేరకు ప్రకటన వస్తుందని ఆశించాను. కానీ నిరాశే ఎదురైంది. కానీ ఆ సమయంలో గడ్కరీ గొప్ప సహకారం అందించారు" అని సింగ్ అన్నారు. ఎన్నికల సమయంలో ఈ అంశం ప్రస్తావనకు వస్తుందని చెప్పారు. ప్రతిభాసింగ్ .. హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ సతీమణి. ఈమె ప్రస్తుతం మండి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి కంగనా రనౌత్‌ను భాజపా బరిలో దింపింది. ఇదిలాఉంటే.. కొద్దిరోజుల క్రితం హిమాచల్ రాష్ట్ర రాజకీయాల్లో సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. అప్పుడు ఆమె భాజపా పనితీరును కొనియాడిన సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ సూచనలతో ఆ పార్టీ చురుగ్గా పని చేస్తోందని వ్యాఖ్యానించారు.

# ఇజ్రాయెల్‌పై దాడి చేస్తాం..



అమెరికాకు ఇరాన్ సంచలన లేఖ

సిరియాలోని తమ కాన్సులేట్ కార్యాలయంపై అనుమానాస్పద దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయెల్‌పై దాడికి సన్నద్ధమవుతున్నామని, ఈ విషయంలో కలగజేసుకోవద్దంటూ అగ్రరాజ్యం అమెరికాకు ఇరాన్ సంచలన లేఖ రాసింది. ఇజ్రాయెల్‌పై దాడికి దూరంగా ఉండాలని హెచ్చరించింది. మధ్యలో కలగజేసుకుంటే అమెరికా కూడా దెబ్బతింటుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ అధ్యక్షుడి రాజకీయ వ్యవహారాల డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మహ్మద్ జంషిద్ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ లేఖపై స్పందించిన అమెరికా తమపై దాడులు చేయవద్దంటూ కోరిందన్నారు. మధ్యప్రాచ్యంలో తన ప్రధాన మిత్రపక్షమైన మిలిటెంట్ గ్రూపు 'హిజ్బుల్లా'.. ఇజ్రాయెల్‌పై దాడికి సన్నద్ధమవుతున్న వేళ ఇరాన్ ఈ లేఖ రాయడం గమనార్హం. కాగా ఇరాన్ లేఖపై అమెరికా అధికారికంగా ఇప్పటివరకూ స్పందించలేదు.

# ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాలను ఆపండి

జెనీవా : గాజాలో నెలల తరబడి సాగుతున్న యుద్ధం, విధ్వంసం, ప్రాణనష్టంతో అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనలు, ఖండనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాలను తక్షణమే ఆపేయాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. గాజాలో సాగుతున్న యుద్ధ నేరాలకు ఇజ్రాయిల్‌ను బాధ్యురాలిని చేయాలని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పాలస్తీనియన్లపై హక్కుల ఉల్లంఘనలను నివారించే లక్ష్యంతో ఈ తీర్మానం రూపొందించారు. 47 మంది సభ్యులు కలిగిన మానవ హక్కుల మండలిలో తీర్మానానికి అనుకూలంగా 28 ఓట్లు రాగా, ఆరు ఓట్లు వ్యతిరేకంగా వచ్చాయి. 13మంది గైర్హాజరయ్యారు. పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ఉపయోగిస్తున్న ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, అలాగే అటు పౌర ప్రయోజనాలకు ఇటు సైనిక ప్రయోజనాలకు ఉపయోగించగల పరికరాల దిగుమతులపై తక్షణమే స్వతంత్ర దర్యాప్తు చేపట్టాల్సిందిగా ఐక్యరాజ్య సమితి మద్దతు కలిగిన ఇన్వెస్టిగేటర్లను మండలి కోరింది. అయితే ఈ తీర్మానానికి కట్టుబడి వుండాల్సిన అవసరం లేదు. అమెరికా, జర్మనీ, ఇతర దేశాలు ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తుండగా, కొన్ని యురోపియన్ దేశాలు మాత్రం అనుకూలంగా ఓటు వేశాయి. చాలా దేశాలు గైర్హాజరయ్యాయి. అమెరికాతో కలిసి ఇజ్రాయిల్ ఈ తీర్మానాన్ని తీవ్రంగా విమర్శించింది. ఇజ్రాయిల్ పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ తరచుగా మండలిని విమర్శిస్తోంది. మరే ఇతర దేశంపైనా చేయనన్ని తీర్మానాలను మానవ హక్కుల మండలి, ఇజ్రాయిల్‌పై చేసింది.

# కచ్చతీవుపై భారత్ డిమాండ్లకు ఆధారాలు లేవు

కొలంబో: లోక్‌సభ ఎన్నికల వేళ భారత్‌లో కచ్చతీవు ద్వీపం వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇటీవల ఈ విషయంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షం డీఎంకేలను లక్ష్యంగా చేసుకుని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా శ్రీలంక మత్స్యశాఖ మంత్రి డగ్లస్ దేవానంద స్పందించారు. కచ్చతీవును భారత్ తిరిగి స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్లకు ఎలాంటి ఆధారమూ లేదని ఆయన స్పష్టం చేశారు. 1974 నాటి ఒప్పందం ప్రకారం కచ్చతీవును శ్రీలంకకు అప్పగించినా, ఇరుదేశాల మత్స్యకారులు ప్రాదేశిక జలాల్లో రెండువైపులా చేపలు పట్టుకోవచ్చు. అయితే 1976లో మరో ఒప్పందం కుదిరింది" అని గుర్తు చేశారు. దాని ప్రకారం సముద్రంలో సరిహద్దులు విభజించారు. ఒక దేశం జాలరులు మరొకరి జలాల్లో చేపలు పట్టడం నిషిద్ధం. "కన్యాకుమారికి దిగువన వాడ్జ్‌బ్యాంక్ పేరుతో పిలిచే ఒక ప్రాంతం ఉంది. విస్తృత వనరులతో ఉన్న ఆ ప్రాంతం కచ్చతీవు కంటే 80 రెట్లు పెద్దది. 1976 ఒప్పందం ప్రకారం అది భారత్‌కు దక్కింది" అని దేవానంద వెల్లడించారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఇప్పటివరకు 178 మంది భారత మత్స్యకారుల్ని, 23 చేపల పడవలను శ్రీలంక ప్రభుత్వం అదుపులోకి తీసుకుంది.

# 27 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులను రక్షించిన భారత తీరదళం

స్టీరింగ్ వ్యవస్థ మరమ్మతులకు లోనైన బోటులో చిక్కుకుపోయిన 27 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులను భారత తీర రక్షణ దళం రక్షించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ పడవ గురువారం భారత జలాల్లోకి కొట్టుకొచ్చింది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వద్ద గస్తీ తిరుగుతున్న మన తీరరక్షణ దళ నౌక 'అమోఘ్'.. సాగర్-2 అనే మత్స్యకారుల పడవను గుర్తించింది. దీంతో పరిస్థితి వాకబు చేయడానికి భారత అధికారులు ఒక బృందాన్ని ఆ పడవలోకి పంపారు. స్టీరింగ్ వ్యవస్థ దెబ్బతినడంతో ఈ బోటు భారత జలాల్లోకి కొట్టుకొచ్చిందని గుర్తించారు. లోపాన్ని సరిదిద్దేందుకు కోస్ట్‌గార్డు సాంకేతిక బృందం ప్రయత్నించింది. అయితే బోటు చుక్కాని పూర్తిగా దెబ్బతిందని, సముద్రంపై దానికి మరమ్మతులు చేయలేమని గుర్తించింది. ఆ పడవను అమోఘ్ సాయంతో లాక్కుంటూ వెళ్లి, అదే ప్రాంతంలో చేపల వేట సాగిస్తున్న మరో బంగ్లాదేశ్ పడవకు అప్పగించింది. మరోవైపు కోల్‌కతాలోని తీరరక్షణ దళ ప్రధాన కార్యాలయం.. బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డుకు ఈ విషయాన్ని తెలియజేసింది. దీంతో ఆ దేశ తీరరక్షణ దళం వచ్చి.. సాగర్-2ను తరలించుకెళ్లింది. 27 మంది మత్స్యకారులను కూడా భారత బృందం.. బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డుకు అప్పగించింది.

# వడదెబ్బతో బాధపడుతున్నారా..?




తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతుండటంతో వడదెబ్బ బారిన పడేవాళ్ల సంఖ్య పెరుగుతోంది. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు చెక్ పెట్టొచ్చు.. అవి ఏమిటంటే.. వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుండి బయటికి రావొద్దు. ఉదయం లేదా సాయంత్రపు వేళల్లో మాత్రమే బయటికి రావాలి. సాధ్యమైనంత వరకు చిన్న పిల్లలతో ప్రయాణం చేయొద్దు. రద్దీగా ఉండే ప్రదేశాలలో చలివేంద్రాల్లోని నీటిని తాగి ఎండ బారి నుంచి కాపాడుకోవాలి. వ్యవసాయ కూలీలు, కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలి. శీతల పానీయాలు, చల్లగా ఉండే ఆహార పదార్థాలు తగ్గించుకోవాలి. వడ దెబ్బకు గురైన వ్యక్తులకు అందించాల్సిన ప్రథమ చికిత్సపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలి. జ్యూస్ కేంద్రాలను, ఐస్ క్రీమ్ నాణ్యతలు లేకుండా మార్కెట్లో ఉంటున్నాయి. కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొనుకొని తాగాలి. కాటన్ వస్త్రాలు ధరించాలని తెలిపారు. ప్రజలు బయటికి వెళ్లునపుడు తలకు ఎండ తగలకుండా గొడుగు, టోపి, కండువాతో తలను కప్పు కోవాలని సూచించారు. ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల గుండె లయ తప్పుతుంది. శరీరంలోని శక్తినంతా పీల్చేసిన అనుభవం కలుగుతుంది. మెదడు కూడా సమతుల్యత తప్పుతుంది. ఈ పరిస్థితిని తట్టుకోలేకపోతే మరణాలు సంభవిస్తాయి. వడదెబ్బ వల్ల 40 శాతం వేరకు మరణాలు చోటుచేసుకుంటున్నాయి. వడదెబ్బ వల్ల శరీరంలోని నీటి శాతం కోల్పోతారు. చెమట పట్టడం నిలిచిపోతుంది. నాడి వేగం పెరుగుతుంది. శరీరం అదుపుతప్పుతుంది. మెదడు స్వాధీనంలో ఉండకపోవడం వల్ల గందరగోళానికి గురవ్వుతారు. కళ్లు మసకబారుతాయి. వెంటనే నివారణ చర్యలు చేపట్టకపోతే కోమాలోకి జారుకుంటారు. పొడి చర్మం ఉండేవారు కూడా త్వరగా వడదెబ్బకు గురవ్వుతారు. కాబట్టి పై జాగ్రత్తలు విధిగా పాటించాలి

# జంక్ ఫుడ్ ఎక్కువగా తింటున్నారా?



ఒకప్పటి ఆహార అలవాట్లకు ఇప్పటి ఆహార అలవాట్లకు చాలా తేడా ఉంది. ప్రస్తుతం పిల్లలకు ఇచ్చే ఆహారం గురించి చాలా ఆలోచించాల్సిందే. కానీ ఏడుస్తున్నారు అని ఏది అడిగితే అది కొనిస్తుంటారు తల్లిదండ్రులు. వాటివల్ల చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంటుంది. కొన్ని సార్లు దీర్ఘకాలిక సమస్యల బారిన పడే ప్రమాదం కూడా ఉంది. ఇక జంక్ ఫుడ్స్ కు ఇప్పటికే ఎంతో మంది పిల్లలు అలవాటు పడ్డారు. చాక్లెట్స్, బిస్కెట్స్, ముఖ్యంగా చిప్స్ ప్యాకెట్ అంటూ ఫుల్ గా తింటారు. ఇలా ఎక్కువ జంక్ ఫుడ్స్ తినడం వల్ల చాలా సమస్యలు వస్తాయి. ఏకంగా ఇంగ్లాండుకు సంబంధించిన ఒక అబ్బాయి తన కంటిచూపును కోల్పోయాడు. 15 సంవత్సరాల వయసు ఉన్న ఈ అబ్బాయికి కంటిచూపు పోయింది. ముందుగా మసక మసకగా కనిపించడం తో డాక్టర్ వద్దకు తీసుకొని వెళ్లారు తల్లిదండ్రులు. అయితే విటమిన్ డి డెఫిషియన్సీ అని చెప్పారు. దానికి సంబంధించిన మందులు ఇచ్చారు డాక్టర్. కానీ కొన్ని రోజులకు ఆ బాబుకు కంటి చూపు పోయింది. మళ్లీ డాక్టర్ వద్దకు వెళితే ఈ సమస్యకు పరిష్కారం కనుగొనలేకపోయారు. కానీ రీసెర్చ్ చేసిన తర్వాత షాకింగ్ విషయాలు తెలిశాయట. ఇంతకీ అదేంటి అనుకుంటున్నారా? ఈ అబ్బాయి రోజు తినే ఫుడ్ లో చిప్స్ పాకెట్స్, జంక్ ఫుడ్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తినడం వల్ల విటమిన్ డి డెఫిషియన్సీ సమస్య పెరిగిపోయిందట. కాల్షియం, విటమిన్స్ తగ్గిపోయాయట. దీనివల్ల ఆ అబ్బాయి కంటి నరాల పనితీరు మొత్తం డామేజ్ అయింది. దీనివల్ల కంటి చూపును కోల్పోయాడు. ముందుగా మసక మసక కనిపించి, ఆ తర్వాత పూర్తిగా కంటి చూపును కోల్పోయాడు ఈ అబ్బాయి. అయితే కొందరిలో వినికిడి శక్తి కూడా పోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. జంక్ ఫుడ్ తినే అలవాటు ఉంటే కచ్చితంగా దూరం పెట్టడం ముఖ్యం. అడిగారు కదా ఏడుస్తున్నారు కదా అని చిప్స్, కుర్ కురేలు ఇవ్వకండి. జంక్ ఫుడ్స్ కు మరింత దూరంగా ఉంచండి. లేదంటే పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.


# ఎండు కొబ్బరి ప్రయోజనాలు...



దాదాపు ప్రతి ఒక్కరి ఇళ్లలో ఎండు కొబ్బరిని ఉపయోగిస్తారు. పూజ నుండి వంట వరకు అన్నింటిలో కొబ్బరిని ఉపయోగిస్తారు. ఎండు కొబ్బరిని అనేక వంటకాల తయారీలో కూడా ఉపయోగిస్తారు. తినడానికి కూడా చాలా రుచిగా ఉంటుంది. ఎండు కొబ్బరి పొడిని ఉపయోగించడం వల్ల ఆహారం రుచి పెరగడమే కాకుండా దాని వినియోగం ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. కొబ్బరిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్, కాల్షియం, మాంగనీస్, సెలీనియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం మొదలైనవి ఉంటాయి. అదనంగా ఎండు కొబ్బరిలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. అయితే ఎండు కొబ్బరిని తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. అందుకే ఎండు కొబ్బరి లాభాలు, నష్టాల గురించి తెలుసుకుందాం. రుచి, సువాసన కోసం ఎండు కొబ్బరి తినడం వల్ల మనకు చాలా ప్రయోజనాలు లభిస్తాయి. ఏదైనా డెజర్ట్ లేదా వంటలో ఎండు కొబ్బరిని జోడించడం వల్ల దాని రుచి మరింత పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. అనేక ఇతర వ్యాధులు కూడా నయమవుతాయి. దీని గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుండి ఉపశమనాన్ని అందించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్ ను సులభంగా తగ్గిస్తాయి. తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పనిసరిగా ఆహారంలో కొబ్బరిని తీసుకోవాలి. ఎండు కొబ్బరిని తినడం వల్ల మన మెదడు పదును పెట్టడమే కాకుండా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అదే సమయంలో మన హృదయాన్ని బలపరుస్తుంది. కొబ్బరిని పొడి లేదా తడి రూపంలో తినడం మన జుట్టుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఎండు కొబ్బరి తినడం వల్ల మన జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చు. ఇది క్రమంగా కొత్త జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది.

# డార్క్ చాక్లెట్ తింటే ఇన్ని లాభాలా..?

డార్క్ చాక్లెట్ ను క్రమం తప్పకుండా మోతాదులో తినడం వల్ల ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది. ఇది మన మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. డార్క్ చాక్లెట్ కూడా శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. డార్క్ చాక్లెట్ కేలరీలతో నిండి ఉన్నప్పటికీ ఇది బరువు తగ్గడానికి అనుకూలంగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ మన గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. డార్క్ చాక్లెట్ తినడం వల్ల మీ శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ లెవల్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. డార్క్ చాక్లెట్‌లో ఉండే అధిక మొత్తంలో మెగ్నీషియం రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. డయాబెటీస్ పేషెంట్లకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు మెరుగుపడతాయి. డార్క్ చాక్లెట్ ను తింటే ఆకలి కంట్రోల్ అవుతుంది. అలాగే ఈ చాక్లెట్ గట్ లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే థియోబ్రోమిన్ శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. ఎన్-ఎసిల్ ఇథనోలమైన్స్ (యూఫోరిక్ ప్రభావాన్ని కలిగి ఉండే కొవ్వు ఆమ్లం) ఫెనిలేథైలమైన్ ( డోపమైన్ ను ప్రేరేపిస్తుంది) ఇవన్నీ కూడా డిప్రెషన్ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. డార్క్ చాక్లెట్?లో ఉండే మెగ్నీషియం, యాంటీ



ఆక్సిడెంట్లు శరీర నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. పిల్లల నుంచి పెద్దల వరకు చాక్లెట్స్ అంటే ఇష్టపడతారు. అయితే, డార్క్ చాక్లెట్ లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ చాక్లెట్లను తింటే మన చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలను కూడా తగ్గించుకోవచ్చు.

# బ్రష్ ఎన్ని రోజులు ఉపయోగించాలి?



మనం ఉదయం లేవగానే ప్రతి ఒక్కరూ కచ్చితంగా బ్రష్ చేయడం ఆనవాయితీగా మారింది.. జస్ట్ బ్రష్ చేయడమే కదా అని లైట్ గా తీసుకుంటున్నారా అయితే ప్రమాదంలో పడినట్టేనట.. దంతాలను బ్రష్ సరిగ్గా చేయకపోవడంతో పలు రకాల అనారోగ్య సమస్యలకు కారణమవుతాయని ఇటీవలే కొంతమంది డెంటిస్టులు తెలియజేస్తున్నారు.. సక్రమంగా బ్రష్ చేయకపోవడం వల్ల గుండెజబ్బులు ,క్యాన్సర్ , వంటి డయాబెటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను కూడా గురయ్యేలా చేస్తున్నాయని తెలియజేస్తున్నారు.. ముఖ్యంగా నోటిలో ఉండేటువంటి సూక్ష్మజీవులు దిగువుకు వెళ్లి కడుపులో ఆమ్లం పైన చాలా ప్రభావాన్ని చూపిస్తాయని ఇటీవలే అమెరికన్ పరిశోధకులు గుర్తించారట. 200 ప్రేగు క్యాన్సర్ కేసులను సైతం అక్కడ సైంటిస్టులు గుర్తించినట్లు తెలుస్తోంది. సూక్ష్మజీవులు క్యాన్సర్ పురోగతిని ప్రేరేపిస్తాయని దీనివల్ల కాలక్రమవ్మైన ప్రాణాంతకవ్మైన వ్యాధిగా మారుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు.. దంతాల అశుభ్రత పెద్ద ప్రేగు క్యాన్సర్ చాలా ప్రమాదానికి గురయ్యేలా చేస్తాయట.. అయితే నోటిలో కొన్ని సహజమైన బాక్టీరియాలో ఉంటాయని పరిశోధకులు చొప్పినప్పటికీ సరైన విధంగా బ్రష్ చేయకపోతే ఇవి పెద్ద ప్రేగుకు చేరుకొని క్యాన్సర్ ప్రమాదాన్ని సృష్టిస్తాయట. నోటిలోని క్రిములు ఇతర శరీర భాగాలను కూడా ఎక్కువగా ప్రభావితం చేస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.. ముఖ్యంగా ఫ్యూసోబ్యాక్టీరియం, న్యూక్లియేటమ్ వంటి పిలవబడే బ్యాక్టీరియా కోలోరెక్టాల్ క్యాన్సర్ కారకాలకు దారితీస్తుందట.. అందుకే ప్రతి ఒక్కరు ఉదయం లేవగానే బ్రష్ చేయడం పైన కాస్త శ్రద్ధ వహించడం మంచిదని నిపుణులు వెల్లడిస్తున్నారు.. శుభ్రమైన బ్రష్ చేయడం వల్ల ఆరోగ్యకరమైన గుండె తీరును కలిగిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు. అయితే చాలామంది ఒకే బ్రష్ ను ఎక్కువ కాలం పాటు వాడుతున్న చాలా ప్రమాదమని కచ్చితంగా మూడు లేదా 6 నెలలకు ఒకసారి అయినా బ్రష్‌ను మారుస్తూ ఉండాలని వైద్యుల సైతం తెలియజేస్తున్నారు. అప్పుడే దంతాలు చాలా శుభ్రంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయని వెల్లడిస్తున్నారు.

# వేసవిలో సోంపు వాటర్ తాగుతున్నారా?



వేసవిలో ఎండవేడిమి, డిహైడ్రేషన్ నుండి ఉపశమనం కోసం నిమ్మరసం, షికంజి, షర్బత్, సత్తు, చెరకు రసం వంటివి తీసుకోవడం ఉత్తమం.. ఇది శరీరానికి రెట్టింపు ప్రయోజనాలను అందిస్తుంది. వీటితో పాటు వేసవిలో ఉపశమనాన్ని అందించే సోంపు వాటర్ తాగడం కూడా శరీరానికి, ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. సోంపు వాటర్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. సోంపు వాటర్‌తో శరీరం చల్లగా ఉంటుంది. ఇది కూలింగ్ ఎఫెక్ట్‌ని కలిగి ఉంటుంది. సోంపు వాటర్ తాగడం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. డీహైడ్రేషన్ సమస్యను కూడా దూరం చేసుకోవచ్చు. సోంపు వాటర్ లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అనేక రకాల విటమిన్లు కూడా ఉన్నాయి. ఇవి మన శరీరం అనేక విధులకు అవసరం. సోంపు జీర్ణశక్తిని మెరుగుపరచడంతో ఆహారంలోని పోషకాలను శరీరం గ్రహించే శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సోంపులో జింక్, ఫాస్పరస్, సెలీనియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్ అధిక పరిమాణంలో లభిస్తాయి. కాబట్టి, ప్రతి రోజు వీటిని నమిలి తినడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నవారు ఈ సోంపు వాటర్ తీసుకోవచ్చు. శరీర బరువును నియంత్రించేందుకు ఫైబర్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రతి రోజు సోంపును తాగడం వల్ల శరీర బరువుకు కూడా సులభంగా తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. సోంపు వాటర్ బరువు తగ్గించడంతో పాటు, శరీర వేడిని అదుపులో ఉంచుతుంది. జీవక్రియను పెంచుతుంది. కడుపును నిండుగా ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన శక్తిని వేగంగా అందించటంలో సహాయపడుతుంది. మీరు కూడా వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే, తప్పకుండా ఈ షర్బత్ తాగండి.

## వాలెంటైన్స్ డే ప్లాన్‌పై రష్మిక



రష్మిక మందన వాలెంటైన్స్ డే సందర్భంగా మంగళవారం నాడు తన అభిమానులతో చిట్ చాట్ చేసింది. అభిమానులు వాలెంటైన్స్ డే సందర్భంగా ఆమెను రకరకాల ప్రశ్నలు సంధించారు. వాలెంటైన్స్ డే స్పెషల్ ఏంటి? ప్లానింగ్ ఏంటి? అని రష్మిక అడిగితే.. అందరూ తమ తమ ప్లానింగ్స్ చెప్పి.. రివర్స్‌లో రష్మికను కూడా అదే అడిగారు. రష్మిక మందన ఎప్పుడూ నెట్టింట్లో యాక్టివ్‌గా ఉంటుంది. తన అభిమానులతో వీలు చిక్కినప్పుడల్లా ఇంటరాక్ట్ అవుతుంది. ఫ్యాన్స్‌తో రష్మిక ఎప్పుడూ ముచ్చట్లు పెట్టేందుకు ప్రయత్నిస్తుంటుంది. అయితే రష్మిక తాజాగా వాలెంటైన్స్ డే సందర్భంగా ట్విట్టర్లోకి వచ్చింది. నెటిజన్లు వాలెంటైన్స్ డే ప్లాన్స్ ఏంటి? అని అడిగింది. అలా చాలా మంది రష్మిక ట్వీట్‌కు స్పందించారు. ఇక రష్మికను సైతం వాలెంటైన్స్ డే ప్లాన్స్ ఏంటి? అని రివర్స్‌లో ప్రశ్నించారు. దానికి రష్మిక కూడా ఫన్నీగా రిప్లైలు ఇస్తూ వచ్చింది. ఇక రష్మిక ఇచ్చిన రిప్లైలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. రష్మిక అభిమానులు పెద్ద ఎత్తున ట్విట్టర్లో స్పందించారు. మరీ ముఖ్యంగా పుష్ప 2కి సంబంధించిన అప్డేట్లు అడిగారు. ఏమైనా లీక్ చేయొచ్చు కదా? అని ఫన్నీగా అడిగేశారు. లీక్ చేయడం వంటివి ఏమీ కుదరవు గానీ.. సినిమా షూటింగ్ మాత్రం ఫుల్ స్వింగులో జరుగుతోంది.. ఆగస్ట్ 15న పుష్ప అందరినీ ఆకట్టుకుంటుందని, శ్రీవల్లి మళ్లీ ఎంటర్టైన్ చేస్తుందన్నట్టుగా రష్మిక చెప్పుకొచ్చింది. ఇక కొంత మంది మాత్రం వాలెంటైన్స్ డే ప్లానింగ్స్ మీద రష్మికను ప్రశ్నించారు. మేం అయితే కాలేజ్‌లో మాస్ బంక్ కొట్టేస్తున్నాం.. అలా బయటకు వెళు_న్నాం.. మీరు కూడా ఇలా నటీనటులంతా కలిసి వాలెంటైన్స్‌కి మాలా బంక్ కొట్టగలరా? అంటూ ఫన్నీగా అడిగేశారు. దీనికి రష్మిక ఫన్నీగా సమాధానం ఇచ్చింది. అది చాలా కష్టం రా.. మాక్కూడా అలా చేయాలని ఉంటుంది కానీ.. ఒక సినిమాను ఒప్పుకున్నామంటే.. ఎంతో బాధ్యత మన మీద ఉన్నట్టే.. అందుకే అలా చేయలేం అంటూ రష్మిక చెప్పుకొచ్చింది.

## సాయి పల్లవి నవ్వుకి ఎవరైనా పడిపోవాల్సిందే





నాగ చైతన్య సాయి పల్లవి ప్రస్తుతం తండేల్ సినిమా కోసం పని చేస్తున్నారు. తండేల్ గ్లింప్స్ ఎంతగా అందరినీ ఆకట్టుకుందో అందరికీ తెలిసిందే. మరోసారి గ్లింప్స్‌ను గుర్తుకు తెచ్చేలా ఈ వాలెంటైన్స్ డేకి సాయి పల్లవి, నాగ చైతన్య కలిసి ఇలా రీల్ వీడియో చేశాడు. నాగ చైతన్య, సాయి పల్లవి జోడికి మంచి క్రేజ్ ఉంటుంది. లవ్ స్టోరీ సినిమాతో ఈ ఇద్దరూ కమర్షియల్‌గా హిట్టు కొట్టేశారు. ఈ ఇద్దరి జోడికి ప్రేక్షక లోకం ఫిదా అయింది. ఇక మళ్లీ ఈ జోడి తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఏడాదే ఈ చిత్రం థియేటర్లోకి రానుంది. ఆగస్ట్‌లోనే సినిమాను రిలీజ్ చేయాలని మేకర్లు భావిస్తున్నారు. ఈ సినిమాను పాన్ ఇండియన్ స్థాయిలో తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీకాకుళం జాలర్లు.. పాకిస్థాన్‌లో చిక్కుకోవడం అంటూ రియల్‌గా జరిగిన ఘటనల నేపథ్యంలో తండేల్‌ను చందూ మొండేటి తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ క్రమంలో తండేల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేయగా.. నెట్టింట్లో మంచి క్రేజ్‌ను దక్కించుకుంది. అయితే వాలెంటైన్స్ డే సందర్భంగా దాన్ని మళ్లీ రీ క్రియేట్ చేశారు నాగ చైతన్య, సాయి పల్లవి. ఈ ఇద్దరూ కలిసి చేసిన ఈ రీల్ వీడియో ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. చివర్లో సాయి పల్లవి చూసిన చూపులు, నవ్విన తీరుక కుర్రకారు ఫిదా అవ్వాల్సిందే. సాయి పల్లవి ఎంత నేచురల్ బ్యూటీ అన్నద ఈ వీడియో చూస్తే అర్థం అవుతుంది. తండేల్ సినిమాలో సాయి పల్లవి పాత్ర అద్భుతంగా ఉండనుందని అర్థం అవుతోంది. నాగ చైతన్యకు సైతం ఈ చిత్రం చాలా ఇంపార్టెంట్ కానుంది. కస్టడీ, థాంక్యూ అంటూ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టేశాడు. విరాటపర్వం తరువాత సాయి పల్లవి మళ్లీ తెలుగులో ప్రాజెక్టులు ఒప్పుకోలేదు. తండేల్‌తో ఈ ఇద్దరూ కమ్ బ్యాక్ ఇస్తారని అంతా నమ్మకంగా ఉన్నారు. కార్తికేయ 2 తరువాత చందూ మొండేటి తీస్తోన్న సినిమా కావడంతో నార్త్‌లోనూ మంచి క్రేజ్ ఏర్పడింది. ఈ తండేల్ సినిమాకు ఇప్పటికి అయితే ఫుల్ పాజిటివ్ బజ్ ఉంది. గీతా ఆర్ట్స్ ఈ మూవీని భారీ రేంజ్‌లో ప్రమోట్ చేసేందుకు సిద్దంగా ఉన్న సంగతి తెలిసిందే. చాలా రోజుల తరువాత గీతా ఆర్ట్స్ నుంచి మరో క్రేజీ, భారీ చిత్రంగా తండేల్ రాబోతోంది.


## మళ్లీ గుర్తు చేసుకున్న సాయి ధరమ్ తేజ్



సాయి ధరమ్ తేజ్ బైక్ ప్రమాద ఘటన నుంచి బయటకు వచ్చాక అందరికీ ఓ మాట ఎప్పుడూ చెబుతూనే వస్తున్నాడు. బైక్ నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకుని వెళ్లండని సూచిస్తూనే ఉన్నాడు. ఆ హెల్మెటే తన ప్రాణాన్ని కాపాడిందని, ఇది తనకు రెండో జీవితమని, అభిమానుల ప్రేమ, ప్రార్థనల వల్లే ఈ రోజు ఇలా ఉన్నానంటూ చెబుతుంటాడు సాయి ధరమ్ తేజ్. మెగా హీరో సాయి ధరమ్ తేజ్ ప్రస్తుతం సినిమా షూటింగ్‌లతో బిజీగా ఉన్నాడు. బైక్ ప్రమాదం వల్ల ఏర్పడిన గ్యాప్‌ను ఇప్పుడు కవర్ చేస్తున్నాడు. ఇప్పుడు తన సినిమాల స్పీడుని పెంచేస్తున్నాడు. సాయి ధరమ్ తేజ్ ఇంకా ఆ బైక్ ప్రమాదం నుంచి పూర్తిగా కోలుకోలేదన్నట్టుగానే కనిపిస్తుంది. ఆయన గొంతు ఇంకా సరిగ్గా రావడం లేదన్నట్టుగానే అనిపిస్తుంది. బైక్ ప్రమాదం తరువాత సాయి ధరమ్ తేజ్ పూర్తిగా మారిపోయాడు. హెల్మెట్ పెట్టుకోవడం వల్లే తాను బతికానని, అందరూ హెల్మెట్ ధరించాలంటూ సాయి ధరమ్ తేజ్ అందరికీ సలహాలు, సూచనలిస్తుంటాడన్న సంగతి తెలిసిందే.

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ (వెస్ట్ జోన్) ఆధ్వర్యంలో బంజారా హిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆడిటోరియంలో రహదారి భద్రతా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సాయిధరమ్ తేజ్ హాజరయ్యాడు. ఈ సందర్భంగా తేజ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం నుంచి కోలుకున్న తనకు ఇది రెండో జీవితమని తెలిపాడు. ప్రమాదం నుంచి బయుపడటానికి హెల్మెట్ కారణమైందని చెప్పుకొచ్చాడు. అభిమానులు, మీలాంటి వాళ్లు, ప్రేక్షకుల ఆశీస్సులతో ఈ రోజు మీ ముందు ఇలా నిలబడ్డానికి కారణమని తెలిపాడు. తప్పకుండా టూవీలర్ డ్రైవ్ చేసే వాళ్లంతా హెల్మెట్‌ను తప్పక ధరించాలని, కార్లు డ్రైవ్ చేసే వారు సీటు బెల్టులు విధిగా ధరించాలని కోరాడు. చాలా మంది ట్రాఫిక్ రూల్స్ పాటించడంలో నిర్లక్ష్యంగా వుంటున్నారని, డ్రైవింగ్‌లో వున్నప్పుడు సేఫ్టీని మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తప్పకుండా అందరూ ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలని కోరాడు. అలాగే మద్యం తాగినప్పుడు డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని హెచ్చరించాడు. అందరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ, ట్రాఫిక్స్ నిబంధనలు పాటించాలని సాయి ధరమ్ తన స్పీచులో పదే పదే చెప్పుకొచ్చాడు. సాయి ధరమ్ తేజ్ ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో గాంజా శంకర్‌గా కనిపించబోతోన్నాడు. ఆ ప్రాజెక్ట్ బడ్జెట్ కారణంగా అటకెక్కిందనే రూమర్లు బాగానే వినిపిస్తున్నాయి. మరి వీటిపై చిత్రయూనిట్ స్పందించాల్సి ఉంది.

## మహర్షి కూడా కాపీనే!



సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'శ్రీమంతుడు' సినిమా కాపీ రైట్ వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'శ్రీమంతుడు' సినిమా కాపీ రైట్ వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. శరత్ చంద్ర అనే రచయిత తన కథను కాపీ కొట్టి ఈ మూవీ తెరకెక్కించారని ఆరోపిస్తూ కోర్టుకు వెళ్లారు. దీనికి సంబంధించి ఇప్పటికే దర్శకుడు కొరటాల శివ పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ వివాదం ఇంకా తేలకముందే, ఇప్పుడు మహేష్ నటించిన 'మహర్షి' మూవీ కూడా చిక్కుల్లో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా నటించిన చిత్రం 'మహర్షి'. ఈ సినిమా కథ కూడా కాపీ అంటూ శరత్ చంద్ర సంచలన ఆరోపణలు చేశారు. తను రాసిన 'సమాహారం' అనే నవలలోని కొన్ని సన్నివేశాలు ఈ చిత్రంలో కనిపిస్తున్నాయని అన్నారు. 'శ్రీమంతుడు' కేసుపై తీర్పు వెలువడగానే, 'మహర్షి' సినిమా విషయంలో తన హక్కును పొందేందుకు కోర్టును ఆశ్రయిస్తానని అంటున్నారు.ఈసారి ఉషా పరిణయం.. 'మహర్షి' అనేది మహేష్ బాబు కెరీర్ లో మైలురాయి 25వ చిత్రం. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతీ మూవీస్, పివిపి సినిమా సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. 2019లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద బ్లాక్ బస్టర్ గా నిలిచింది. నేషనల్ ఫిలిం అవార్డ్స్ కూడా సాధించి, జాతీయ స్థాయిలో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. అలాంటి సినిమా కాపీ అంటూ శరత్ చంద్ర కామెంట్స్ చేయడం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. స్వాతి వారపత్రికలో ప్రచురితమైన తన 'చచ్చేంత ప్రేమ' కథ నుండి సీన్ బై సీన్ కాపీ చేసి 'శ్రీమంతుడు' సినిమా తీశారని శరత్ చంద్ర ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ వివాదం ఓ కొలిక్కి రాకముందే.. ఇప్పుడు వంశీ పైడిపల్లి కూడా తన కథను కాపీ కొట్టి 'మహర్షి' సినిమా తీసినట్లుగా రచయిత ఆరోపిస్తున్నారు. యాదృచ్ఛికంగా ఈ రెండు సినిమాల్లోనూ మహేష్ బాబే హీరో. మరి దీనిపై ప్రొడ్యూసర్ దిల్ రాజు, డైరెక్టర్ వంశీ పైడిపల్లి ఎలా స్పందిస్తారో చూడాలి. ఇదిలా ఉంటే ఇటీవల 'బేబీ' మూవీకి కూడా కాపీ మరకలు అంటుకున్నాయి. స్టోరీ తనదేనంటూ శిరిన్ శ్రీరామ్ అనే షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ హైదరాబాద్ లోని రాయదుర్గంలో ఫిర్యాదు చేశారు. 2015లో తాను రాసుకున్న 'ప్రేమించొద్దు' అనే కథను సాయి రాజేశ్ కు చెప్పానని, కాపీ రైట్ చట్టాన్ని బేబీ ఉల్లంఘించి తన కథనే బేబీ సినిమాగా తీశారని ఆరోపించారు.

## 50 ఏళ్ల కెరీర్‌లోనే

అలాంటి అంచనాలను క్రియేట్ చేయడంలోలాల్ సలామ్ విఫలమైంది. 2023లో కెరీర్ బెస్ట్ హిట్ చిత్రంలో నటించిన సూపర్ స్టార్ రజనీకాంత్, ఏడాది తిరగక ముందే కెరీర్ వరస్ట్ సినిమాని కూడా అందించడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. రజనీకాంత్ సినిమా అంటే తెలుగు రాష్ట్రాల్లోను క్రేజ్ ఉంటుంది. పైగా 600 కోట్లు వసూలు చేసిన జైలర్ తర్వాత ఆయన నుంచి వస్తున్న సినిమాపై సహజంగానే అంచనాలుంటాయి. కానీ అలాంటి అంచనాలను క్రియేట్ చేయడంలోలాల్ సలామ్ విఫలమైంది. సూపర్ స్టార్ రజనీకాంత్ అతిథి పాత్రలో నటించగా, ఆయన కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ రూపొందించిన లాల్ సలామ్ ఇటీవలే విడుదలై బాక్సాఫీస్ వద్ద డిజాస్టరైంది. వీక్ కంటెంట్ ప్రత్యేకత లేని జానర్ తో రూపొందించిన ఈ సినిమాపై తొలి నుంచి బజ్ లేకపోవడం ప్రచారం పరంగా కూడా ఎలాంటి ప్రయత్నం లేకపోవడం దారుణ వైఫల్యానికి కారణమైందని



భావిస్తున్నారు. ఈ చిత్రం 50 లక్షలు అయినా వసూలు చేయడానికి చాలా తంటాలు పడింది. నైజాం జీవితకాల షేర్ 12 లక్షలకు కూడా చేరకపోవచ్చని ట్రేడ్ చెబుతోంది. ఏపీలో 37లక్షల వసూళ్లను మాత్రమే సాధించింది. ఐదు దశాబ్దాల కెరీర్‌లో రజనీకాంత్ చెత్త సినిమాలో నటించారు! అంటూ ట్రేడ్ విశ్లేషకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఐశ్వర్య రజనీకాంత్ మూడు సినిమాలకు దర్శకత్వం వహిస్తే ప్రతిదీ ఫ్లాప్ గానే మిగిలాయి. 3 సినిమాతో ఆమె దర్శకురాలిగా ఆరంగేట్రం చేసారు. ఇక రజనీకాంత్ బ్లాక్ బస్టర్లను ఇప్పుడు రీరిలీజ్ చేసినా కానీ చక్కని వసూళ్లు వస్తాయి కదా! అని కొందరు విశ్లేషిస్తున్నారు. తదుపరి రజనీకాంత్‌కి లోకేష్ కనగరాజ్ సినిమా పెద్ద ఊరటనిస్తుందని అభిమానులు భావిస్తు న్నారు. కనగరాజ్ తనదైన శైలి స్క్రీన్ ప్లే మ్యాజిక్ తో రజనీకి జైలర్ ని మించిన హిట్టిస్తాడని, కనగరాజ్ సరైన చికిత్స చేస్తాడని ఫ్యాన్స్ ఆరాటపడుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

## భైరవ కోనకి సీక్వెల్..ప్రీక్వెల్ కూడా!

యంగ్ హీరో సందీప్ కిషన్ కి సరైన సక్సెస్ పడి చాలా కాలమవుతోంది. కొన్నాళ్లగా యంగ్ హీరోకి విజయం అనేది అందని ద్రాక్షలాగే మారింది యంగ్ హీరో సందీప్ కిషన్ కి సరైన సక్సెస్ పడి చాలా కాలమవుతోంది. కొన్నాళ్లగా యంగ్ హీరోకి విజయం అనేది అందని ద్రాక్షలాగే మారింది. చేస్తోన్న ప్రయత్నాలేవి ఫలించడం లేదు. దీంతో లాభం లేదనుకు న్న యంగ్ హీరో ఇతర హీరోల చిత్రాల్లో కీలక పాత్రలు చేయడం మొదలు పెట్టాడు. వాటిద్వారానైనా సక్సెస్ అవుతున్నాడా? అంటే అదీ కనిపంచడం లేదు. అయినా తాను చేయాల్సిన సోలో ప్రయత్నాలు మాత్రం ఏనాడు ఆపలేదు. ఈ క్రమంలో సందీప్ కిషన్ కి..వి.ఐ ఆనంద్ మరోసారి తోడయ్యాడు. గతంలో ఇద్దరి కాంబినేషన్ లో టైగర్అనే సినిమా తెరకెక్కింది కానీ అది పెద్దగా ఆడలేదు. అటుపై ఊరు పేరు భైరవకోన అంటూ మరోసారి చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు బాగానే హైప్ తీసుకొస్తున్నాయి. మరోవైపు సినిమాని ముందుగానే తెలుగు రాష్ట్రాల్లో స్పెషల్ షోలు కూడా వేస్తున్నారు. మౌత్ టాక్ పాజిటివ్ గానే కనిపిస్తుంది. మరి సినిమా ఎలా ఉంది అన్నది తెలియాలంటే పూర్తి రివ్యూ రావాల్సిందే. ఈ చిత్రాన్ని 16వ తేదీన రిలీజ్ చేస్తున్నారు. అప్పటివరకూ సినిమా ఎలా ఉంది? అన్నది క్లారిటీ వచ్చే అవకాశం లేదు. ఆ సంగతి పక్కనబెడితే తాజాగాఈ సినిమాకి ప్రీక్వెల్..సీక్వెల్ కూడా ఉందని నిర్మా త రాజేష్ దండా ఓ ఇంటర్వ్యూలో రివీల్ చేసారు. ప్రీక్వెల్..సీక్వెల్ చేసే అవకాశం ఉందని కానీ.. సినిమా చివర్లో ఎలాంటి లీడ్ మాత్రం ఇవ్వలేదన్నారు. డిస్ట్రిబ్యూటర్ గా 12 ఏళ్లు పనిచేసిన తర్వాత నిర్మాణం వైపు వచ్చానన్నారు. హీరో సందీప..డైరెక్టర్ వి.ఐ ఆనంద్ చాలా కాలంగా స్నేహితులమని ఈ కారణంగానే ముగ్గురి కాంబినేషన్ లో సినిమా సాధ్యమైందని తెలిపారు. ఇప్పటికే ఈ సినిమా స్టోరీ లైన్ దర్శకుడు రివీల్ చేసిన సంగతి తెలిసిదే. పురాణలతో ఈ కథని ముడిపెట్టి తెరకెక్కించినట్లు..ఓ కొత్త అంశాన్ని సినిమాలో చర్చించినట్లు తెలిపారు.



## ఇన్నాళ్ళకు



టాలీవుడ్ లో మొదట్లోనే గ్లామరస్ బ్యూటీగా మంచి క్రేజ్ అందుకున్న వారిలో మెహ్రీన్ పిర్జాదా ఒకరుటాలీవుడ్ లో మొదట్లోనే గ్లామరస్ బ్యూటీగా మంచి క్రేజ్ అందుకున్న వారిలో మెహ్రీన్ పిర్జాదా ఒకరు. నాని హీరోగా వచ్చిన కృష్ణగాడి వీర ప్రేమ గాధ సినిమాతో అమ్మడు పరిశ్రమలోకి అడుగు పెట్టింది. అనంతరం వరుస సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నాలు చేసింది. ఇక ఆ తర్వాత వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తుంది. తెలుగుతో పాటు తమిళ, హిందీ, పంజాబీలో పలు సినిమాలు చేసింది. దాదాపు అన్ని భాషల్లోనూ మొదట్లో సక్సెస్ ఫుల్ హీరోయిన్?గా గుర్తింపు అయితే తెచ్చుకుంది. ఇక కొంతకాలం నుంచి అమ్మడి టైమ్ కాస్త బాలేదు. వెండితెరపై అంతగా క్లిక్కవ్వకపోయినా గ్లామర్ తో మాత్రం సోషల్ మీడియాలో బాగానే హడావుడి చేస్తోంది. రీసెంట్ గా మెరిసే కలర్ఫుల్ డ్రెస్సులో అమ్మడు వయ్యారంగా నిలబడి ఫొటోలకు పోజులు ఇచ్చింది. ఇక అందులో ఎద అందాలతో కూడా స్టన్ అయ్యేలా కనిపించింది. ఇక ఈ గ్లామర్ తోనే అమ్మడు మళ్ళీ అవకాశాలు అందుకుంటూ బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తోంది. ఇక ఆ మధ్య మెహ్రీన్ ఎంగేజ్మెంట్ తో షాక్ ఇచ్చింది. ఏమైందో తెలియదు కానీ... ఆ తర్వాత పెళ్లి వరకు వచ్చి క్యాన్సిల్ చేసుకున్నట్లు ప్రకటించింది. వ్యక్తిగత విషయాలను పక్కన ఆమె కెరీర్ లో మొదట వరుస సక్సెస్ లు చూసింది. ఎఫ్?-2 బాగానే ఆడింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వెంకటేష్, వరుణ్ తేజ్ హీరోలుగా నటించారు. అయితే దానికి సీక్వెల్?గా అనంతరం ఎఫ్-3 సినిమా వచ్చింది. ఈ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ కాలేకపోయింది. మెహ్రీన్ నటన చూసి ఓవర్ యాక్టింగ్ చేసిందనే కామెంట్స్ కూడా వచ్చాయి. ఎఫ్?2 కు వచ్చినా.. క్రేజ్, ఎఫ్?3 కి పెద్దగా రాలేకపోయింది. అనంతరం మరికొన్ని సినిమాలు కూడా బెడిసికొట్టడంతో ఈ భామకు అవకాశాలు తగ్గాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ఓ చిన్న సినిమా చేస్తోంది. ఈ సినిమాపై ఈ భామ భారీ అంచనాలే పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

## శర్వానంద్ ఏం చేస్తున్నాడు?



టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్.. ఈ మధ్యకాలంలో నటిస్తున్న సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద వరుసగా ఫ్లాప్స్ అవుతున్నాయి. టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్.. ఈ మధ్యకాలంలో నటిస్తున్న సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద వరుసగా ఫ్లాప్స్ అవుతున్నాయి. మహానుభావుడు, శతమానం భవతి సినిమాల తర్వాత మళ్లీ ఆ రేంజ్ సక్సెస్ ను ఇప్పటి వరకు అందుకోలేకపోయారు. ఈ చిత్రాల తర్వాత శర్వానంద్ నటించిన పడి పడి లేచే మనసు, జాను, శ్రీకారం, ఆడవాళ్లు మీకు జోహార్లు వంటి సినిమాలన్నీ నిరాశే మిగిల్చాయి. ఇక శర్వా గతేడాది నటించిన ఒకే ఒక జీవితం పర్వాలేదనిపించింది. అయితే ఈసారి ఎలాగైనా భారీ కమ్ బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కాస్త ఆలస్యమైనా కథల విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ప్రస్తుతం శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వా.. ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ యంగ్ హీరో మరో సినిమాను సైలెంట్ గా స్టార్ చేసేశారు. ఎలాంటి హడావుడి లేకుండా పూజా కార్యక్రమాలు కూడా జరిగిపోయాయి. అంతే కాదు రెగ్యులర్ షూటింగ్ కూడా స్టార్ట్ అయింది. లూజర్ వెబ్ సిరీస్ తో మంచి పేరు తెచ్చుకున్న అభిలాష్ రెడ్డితో నెక్స్ట్ మూవీ చేస్తున్నారు శర్వానంద్. మాళవిక నాయర్ హీరోయిన్ గా నటిస్తోంది. గత కొద్ది రోజులుగా ఈ ప్రాజెక్ట్ పై రూమర్లు వినిపిస్తున్నా.. ఎలాంటి సౌండ్ లేకుండా మేకర్స్ స్టార్ట్ చేసేశారు. యూవీ క్రియేషన్స్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఫస్ట్ షూటింగ్ షెడ్యూల్ మార్చి 1వ తేదీకి కంప్లీట్ అవ్వనుందట. ఈసారి ఉషా పరిణయం.. మరోవైపు, శర్వానంద్ మరో డైరెక్టర్ కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫ్లాపుల్లో ఉన్న శ్రీవిష్ణు కు సామజవరగమన సినిమాతో బ్లాక్ బస్టర్ అందించిన రామ్ అబ్బరాజుతో చేతులు కలపనున్నారట. త్వరలోనే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనుందట. అయితే సామజవర గమన థియేటర్స్ లో ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.50 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టి బ్లాక్ బాస్టర్ హిట్ అందుకుంది. శర్వానంద్- రామ్ అబ్బరాజు ప్రాజెక్ట్ ను అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ రెండు సినిమాల్లో.. ఏ మూవీ శర్వాకు గట్టి కమ్ బ్యాక్ ఇస్తుందో చూడాలి మరి.

## ఎత్తుకెళ్లిన అవార్డుని దర్శకుడి ఇంటి ముందు పెట్టిన దొంగ

తమిళ దర్శకుడు మణికంఠన్ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో పడ్డ దొంగలు.. డబ్బుతో పాటు తెలియకుండా జాతీయ అవార్డులను కూడా దోచుకెళ్లారు. జాతీయ అవార్డు విలువ తెలిసిన ఆ దొంగలు.. తిరిగి వాటిని ఇచ్చేశారు. క్షమాపణలు చెబుతూ ఓ లేఖ రాసి వెళ్లిపోయారు. దీంతో ఆ దొంగల మంచి మనసుని నెటిజన్లు పొగిడేస్తున్నారు.

ప్రముఖ సినీ దర్శకుడు మణికంఠన్ ఇంట్లో చోరీ జరిగింది. దొంగలు డబ్బు, బంగారంతో పాటుగా ఆయనకు వచ్చిన జాతీయ అవార్డును కూడా దొంగిలించేశారు. అయితే జాతీయ అవార్డుల విలువ ఆ దొంగలకు తెలిసినట్టుగా ఉంది. కాస్త మంచి మనసున్న దొంగల్లా అనిపిస్తోంది. ఆ జాతీయ అవార్డు ఎంత విలువైందో తెలుసుకుని.. తిరిగి ఇచ్చేశారు. దాంతో పాటుగా క్షమించమని ఓ లేఖ కూడా రాసి పెట్టారు. ప్రస్తుతం ఈ లేఖ నెట్టింట్లో వైరల్ అవుతోంది.

జాతీయ అవార్డులను దొంగిలించినందుకు ఆ దుండగులు క్షమించమని కోరుతూ లేఖ రాసి ఆయన ఇంటి బయట వదిలేసి వెళ్లారు. మణికంఠన్‌కు 'కాక్కా ముట్టై', 'కడైసి వివసాయి' సినిమాలకు జాతీయ పురస్కారాలు లభించాయి. మణికంఠన్ మదురై జిల్లా ఉసిలంపట్టిలో ఉంటున్నాడు. ఆయన ఇంట్లో 8వ తేదీ రూ.లక్ష నగదు, 5 సవర్ల బంగారు నగలు చోరీకి గురయ్యాయన్న సంగతి తెలిసిందే. డబ్బు, నగలతో పాటు జాతీయ అవార్డులను ఎత్తుకెళ్లారు.

# టెకీలకు కొత్త కష్టాలు



కాలం మారుతోంది. ఖర్చులు పెరుగుతున్నాయి. వీటికి అనుగుణంగా సంపాదన కూడా ఉండాలని నేటి తరం యువత భావిస్తోంది. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా.. లక్షల్లో సంపాదన ఉన్నా యువతులు తమను పెళ్లాడేందుకు ఆసక్తి చూపడం లేదంటూ కొందరు టెకీలు తలలు పట్టుకుంటున్నారు. భారీ ప్యాకేజీ ఉన్న వారివైపే మొగ్గు చూపుతున్నారట. తాజా పరిణామం నెట్టింట కొత్త చర్చకు దారితీసింది. ఇందుకు సంబంధించిన సోసల్ మీడియా పోస్ట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. వివరాల్లోకెళ్తే.. ఓ యువకుడు బాగా చదువుకుని ఇంజనీరింగ్ కొలువు కొట్టాడు. ఉద్యోగం వచ్చింది కదా అని రెండేళ్ల తర్వాత తల్లిదండ్రులు చూసిన అమ్మాయిని అరేంజ్డ్ మ్యారేజ్ చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. అలా ఓ అమ్మాయిని చూసేందుకు వారి ఇంటికి వెళ్లారు. మాటల మధ్యలో వరుడి వార్షిక వేతనం ఎంత అని వధువు తరపు బంధువులు ప్రశ్నించారు. రూ.8 లక్షలు అని వరుడు సమాధానం చెప్పాడు. దీంతో వెంటనే వధువు సదరు పెళ్లి సంబంధాన్ని తిరస్కరించింది. కారణం ఏంటని ప్రశ్నించగా తనకు ఉద్యోగం లేదని, వరుడికి కనీసం ఏడాదికి రూ.25 లక్షల జీతం ఉంటే తప్ప కుటుంబం గడవదని ఇంత తక్కువ జీతంతో కుటుంబాన్ని నడపడం కష్టమని వివరణ ఇచ్చింది. వధువు సమాధానం విని వరుడు తరపు బంధువులు నోరెల్ల బెట్టారు. ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజీ ఉన్న తనను వివాహం చేసుకునేందుకు ఓ యువతి తిరస్కరించిందని తన గోడును స్నేహితునికి చెప్పుకుని గొల్లుమన్నాడు. దీంతో సదరు స్నేహితుడు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఏడాదికి రూ.8 లక్షలు సంపాదించే తన ఇంజనీర్ ఫ్రెండ్ వివాహ కష్టాలు తెలిపాడు. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. నెట్టింట పోస్ట్? చేసిన ఒక్క రోజులోనే 5.1లక్షల వీక్షణలు?, వేలల్లో లైక్స్? వచ్చాయి. అయితే.. చాలా మంది ఆ వదువుకు మద్దతుగా కామెంట్స్? చేస్తున్నారు. 'పర్లేదు. అంచనాలు పెట్టుకోవడంలో తప్పేముంది? పెళ్లికి ముందే ఆమె తన అంచనాలను స్పష్టంగా వెల్లడించింది. ఇది అబ్బాయికి సదావకాశం. రాబోయే 2-4 సంవత్సరాలలో తన వార్షిక వేతనం రూ. 25 లక్షలకు పెంచుకునే పనిలో ఉంటాడు. లేదంటే ఏడాదికి రూ.5 లక్షలు ఆశించే వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు అంటూ ఓ యూజర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. దంపతులు మెట్రో నగరంలో నివసించాల్సి వస్తే ఏడాదికి రూ.8 లక్షలు చాలా తక్కువ. కనీసం రూ.15 లక్షలైనా ఉండాలని మరో యూజర్ వాస్తవాన్ని అంగీకరించాల్సిందేనని రాసుకొచ్చాడు.

# ఇండియా రోడ్లపై టెస్లా కార్లు




ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద కార్ మార్కెట్ భారత్. అమెరికా, చైనా తర్వాత ఎక్కువగా కార్లు అమ్ముడయ్యే దేశం మనది. ఇందుకోసమే ప్రపంచంలో కార్లు తయారు చేసే కంపెనీలన్నీ ఇండియాలో మార్కెటింగ్?కు ఉత్సాహం చూపిస్తూ ఉంటాయి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరికీ డ్రీమ్ కార్?గా ఉంది టెస్లా. టెస్లా కంపెనీ అధినేత ఎలన్ మాస్క్ గత కొన్నేళ్లుగా ఇండియాలో టెస్లా కంపెనీ ప్రారంభించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. భారత్లో ఉన్న పన్నులు, కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో ఇన్నాళ్లుగా ఇండియాలో టెస్లా కార్లను ప్రవేశపెట్టలేకపోయారు మాస్క్. కానీ ఇక్కడ తయారు చేయకపోయినా జర్మనీలో తయారుచేసి ఎగుమతి చేయాలనేది లేటెస్ట్ ఆలోచనగా కనిపిస్తుంది. ఇందుకోసమే గత కొద్ది నెలలుగా జర్మనీలో ఉన్న టెస్లా ప్లాంట్?లో రైట్ హ్యాండ్ కార్లను తయారు చేస్తున్నారు. భారత్లో ప్లాంట్ నెలకొల్పడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. ఆ లోపు ఇండియాలో ఉన్న కొంతమంది బిలినియర్లకైనా టెస్లను ఇంపోర్ట్ చేయాలనేది కంపెనీ ఆలోచన. ఇందుకోసమే ఇండియన్ రోడ్లకు అనుకూలంగా ఉండేలా, ఇండియన్ డ్రైవింగ్?కి సరిపోయేలా రైట్ హ్యాండ్ కార్లను తయారు చేస్తున్నారు. కానీ అమెరికా, యూకే, జర్మన్ దేశంలో ఉన్నట్లుగా ఆటోడ్రైవ్ ఆప్షన్ ఇండియాలో దిగుమతి చేసే కారులో ఉంటుందా.. ఉండదా అనే విషయంలో ఇంకా క్లారిటీ లేదు. భారత్?లో దిగుమతి చేయడానికి కంపెనీకి పెద్దగా అడ్డంకులు లేకపోవడంతో ఈ ఏడాది చివర్లో ఇండియాలోకి టెస్లా ఎంటర్ కానుంది. కానీ ఇండియన్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్పోర్ట్ చట్టం ప్రకారం సంవత్సరానికి 8000 కార్లను మాత్రమే పన్నులు కట్టి దిగుమతి చేసే అవకాశం ఉంది. అంతకుమించి పాలసీ ప్రకారం ఇండియాలోకి విదేశాల్లో తయారు చేసిన కార్లను దిగుమతి చేసే అవకాశం లేదు. జర్మనీలోని బెర్లిన్ ప్లాంట్లో తయారు చేస్తున్న ఈ రైట్ హ్యాండ్ కార్లను ఇక్కడికి దిగుమతి చేయనున్నారు. అయితే టెస్లాలో ఉన్న అన్ని మోడల్స్ కాకుండా కేవలం వై మోడల్ మాత్రమే ఇండియాలో ప్రవేశపెట్టన్నారు.

# కొత్త పన్ను విధానంలోనూ మినహాయింపులు ఉన్నాయి




కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రవేశించాం. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఆర్థిక లావాదేవీల పరంగా కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్ని కొత్త మార్గదర్శకాలు కూడా వచ్చాయి. వాటిల్లో ఒకటి కొత్త ఆదాయ పన్ను విధానం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల మధ్యంతర బడ్జెట్ సెషన్‌లో కొత్త పన్ను విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైంది. దీనిలో పన్ను స్లాబ్‌లతో పాటు రాయితీలకు సంబంధించిన పన్ను రేట్లు కూడా మారాయి. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ (ఏఓపీలు) సహా పన్ను చెల్లింపుదారులందరికీ కొత్త పన్ను విధానం వర్తిస్తుంది. ఈ క్రమంలో పన్ను చెల్లింపుదారుల్లో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా కొత్త పన్ను విధానంలోకి మారడం వల్ల పన్ను మినహాయింపులు ఉండవేమో అని ఆందోళన చెందుతున్నారు. ఇది నిజమేనా? కొత్త పన్ను విధానంలోకి మారడం వల్ల ప్రయోజనం ఉండదా? పన్ను ఆదా చేసుకునే వెసులుబాటు ఉండదా? కొత్త పన్ను విధానంలోకి మారడం వల్ల ప్రయోజనం ఉంటుందా లేదా అనే సందిగ్ధంలో పలువురు పన్ను చెల్లింపుదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే, కొత్త పన్ను విధానం కూడా పలు ప్రయోజనాలను కలిగి ఉందని నిపుణులు చెబుతున్నారు. దానిని ఎంచుకోవడం ద్వారా పన్ను మినహాయింపులను పొందొచ్చని వివరిస్తున్నారు. ఈ తగ్గింపుల వల్ల పన్ను చెల్లింపుదారులకు లక్షలాది రూపాయలు ఆదా అవుతుందంటున్నారు. కొత్త పన్ను విధానంలో అటువంటి పన్ను మినహాయింపులలో కొన్నింటిని చూద్దాం. కొత్త విధానం ప్రకారం, వికలాంగుల వర్గంలోకి వచ్చే పన్ను చెల్లింపుదారులు ప్రత్యేక మినహాయింపు తీసుకోవచ్చు. అటువంటి పన్ను చెల్లింపుదారులు ఏదైనా రవాణా భత్యాన్ని పొందినట్లయితే, వారు దానిపై ఆదాయపు పన్ను మినహాయింపును పొందవచ్చు. ఇది ప్రైవేట్, ప్రభుత్వ రంగ ఉద్యోగులకు వర్తిస్తుంది.



# ఉద్యోగ నియామకాల్లో పెరుగుతున్న ప్రాధాన్యం

మహిళలను వంటిట్లోకే పరిమితం చేసే రోజులుపోయాయి. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎదిగేందుకు వారికి సరైన అవకాశాలు కల్పిస్తున్నారు. ఈమేరకు దాదాపు అందరిలోనూ అవగాహన ఏర్పడుతోంది. దేశ జనాభాలో 69.2 కోట్ల మంది మహిళలు కాగా.. అందులో 37 శాతం మంది ఉద్యోగం లేదా ఉపాధి కలిగి ఉన్నారని కెరియర్‌నెట్ అనే టాలెంట్ సొల్యూషన్ల సంస్థ తన నివేదికలో పేర్కొంది. హైదరాబాద్, పుణె, చెన్నై వంటి నగరాలు మహిళా ఉపాధి విషయంలో అగ్రస్థానంలో ఉన్నాయని తెలిపింది. 25,000 ఉద్యోగ నియామకాలను విశ్లేషించిన తర్వాత 'ద స్టేట్ ఆఫ్ ఉమెన్స్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ ఇండియా' పేరిట నివేదిక రూపొందించారు. నివేదికలోని వివరాల ప్రకారం.. 2022తో పోలిస్తే 2023లో ఉద్యోగ నియామకాల్లో మహిళల ప్రాధాన్యం 2-3% పెరిగింది. ముఖ్యంగా జూనియర్ ప్రొఫెషనల్, ఎగ్జిక్యూటివ్ బోర్డుల్లో ఈ మార్పు కనిపించింది. గతేడాది ఉద్యోగాల్లో చేరిన 40శాతం మంది మహిళలు తాజాగా కళాశాలల నుంచి వచ్చినవారే. 0-3 ఏళ్లు, 3-7 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగాల్లో మహిళల వాటా 20-25% ఉంది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ మినహా దాదాపు అన్ని నగరాల్లో మహిళా నియామకాల నిష్పత్తి పెరిగింది. హైదరాబాద్‌లో అత్యధికంగా 34శాతం నియామక రేటు నమోదు కాగా.. పుణెలో 33 శాతం, చెన్నైలో 29 శాతం ఉంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో 20 శాతం క్షీణత కనిపించింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగంలో మహిళల నియామకాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్(జీసీసీలు), బహుళజాతి కంపెనీ(ఎమ్ఎన్‌సీ)ల ఆఫ్‌షోర్ యూనిట్లలో ఆ ధోరణి కనిపిస్తోంది. పురుషులు, మహిళల మధ్య వేతన అంతరం 2022లో 30 శాతంగా ఉండగా.. గతేడాది 20 శాతానికి తగ్గింది.

# త్వరలో యుపిఐతో నగదు డిపాజిట్




యుపిఐ సాంకేతికతను మరింత విస్తరించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. తాజాగా నగదు డిపాజిట్లను సైతం యుపిఐ ద్వారా చేసే సదుపాయాన్ని త్వరలో తీసుకురానున్నట్లు శక్తికాంత దాస్ తెలిపారు. ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ మూడు రోజుల సమావేశాల అనంతరం శుక్రవారం దాస్ మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు క్యాష్ డిపాజిట్ మిషన్ (సిడిఎం) లో డెబిట్ కార్డు ద్వారా మాత్రమే నగదు డిపాజిట్ చేసే వెసులుబాటు ఉంది. త్వరలో యుపిఐని ఉపయోగించి కూడా సిడిఎంలో డబ్బును జమ చేసే వెసులుబాటును తీసుకొస్తున్నట్లు దాస్ తెలిపారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో డెబిట్ కార్డ్ సాయంతో ఎటిఎంల్లో నగదు ఉపసంహరించుకునే వీలుండేదని.. యుపిఐ రాకతో కార్డ్ లేకుండా నగదు పొందే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. అలాగే యుపిఐతోనూ త్వరలో నగదు డిపాజిట్లు చేసుకోవచ్చన్నారు. వరుసగా ఏడో సారి కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించామన్నారు. రెపో రేటును 6.5 శాతంగానే కొనసాగించాలని ఆర్‌బిఐ భావించిందన్నారు.

# ఎనిమిది శాతం వృద్ధి లెక్క మాది కాదు



వాషింగ్టన్ : భారత వృద్ధి అంచనాలను అమాంతం పెంచి మోడి ప్రభుత్వానికి స్వామి భక్తిని చాటాలని భావించిన ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్‌కు సొంత సంస్థ భారీ షాక్ ఇచ్చింది. భారత్ 8 శాతం వృద్ధి సాధించనుందన్న కృష్ణమూర్తి వ్యాఖ్యలతో తమ ఏజెన్సీకి ఏమాత్రం సంబంధం లేదని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) స్పష్టం చేసింది. ఐఎంఎఫ్ వెలువరించిన అంచనాలకు భిన్నంగా భారత్ 8 శాతం వృద్ధి సాధిస్తుందన్న కృష్ణమూర్తి వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఐఎంఎఫ్ అధికార ప్రతినిధి జూలీ కొజాక్ ఈమేరకు సమాధానం ఇచ్చారు. అవి ఆయన చేసిన సొంత వ్యాఖ్యలని అన్నారు. భారత వృద్ధి అంచనాలను మరికొన్ని వారాల్లో వెల్లడించనున్నామన్నారు. కృష్ణమూర్తి అంచనాలతో తమకు సంబంధం లేదన్నారు. గత 10 ఏళ్లుగా కేంద్రం అవలంబించిన విధానాలు రెట్టింపు చేసి, సంస్కరణలను వేగవంతం చేస్తే 2047 వరకు భారత్ సగటున ఏడాదికి 8 శాతం వృద్ధిని సాధించగలదని కృష్ణమూర్తి ఇటీవల ఢిల్లీలో పేర్కొన్నారు. మరోవైపు ఈ ఏడాది జనవరిలో భారత వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. దీనికి భిన్నంగా కృష్ణమూర్తి వ్యాఖ్యానించడం గమనార్హం.

# ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేసి..

**- భారత్‌లో కురువృద్ధుడైన బిలియనీర్‌గా నిలిచి..!**



లక్ష్మణ్ దాస్ మిత్తల్ భారత్‌లో అత్యంత వృద్ధుడైన బిలియనీర్‌గా నిలిచారు. ప్రస్తుతం ఆయన వయసు 93 సంవత్సరాలు. తన వృత్తి జీవితం ప్రారంభంలో ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుత ఆస్తుల విలువ.. 2.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇటీవలే విడుదలైన ఫోర్బ్స్ 2024 ప్రపంచ బిలియనీర్ల లిస్ట్ ద్వారా ఈ విషయం వెల్లడైంది. దీనికిముందు మహీంద్రా అండ్ మహీంద్రా మాజీ ఛైర్మన్ కేశుబ్ మహీంద్రాకు ఈ గుర్తింపు ఉండేది. అయితే ఆయన ఏప్రిల్ 12, 2023లో మరణించారు. ఇక, ఈ లక్ష్మణ్‌దాస్ స్వరాష్ట్రం పంజాబ్. 1931లో హొశియాపుర్‌లో జన్మించారు. ఆయన ఉర్దూలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. తర్వాత మారుతి ఉద్యోగ్‌లో డీలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోగా .. అది తిరస్కరణకు గురైంది. అనంతర కాలంలో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన ఆయన.. ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్‌ను ఏర్పాటుచేశారు. 60 ఏళ్ల వయసులో సోనాలిక ట్రాక్టర్లను ఆవిష్కరించారు. ఇప్పుడు ఆ గ్రూప్ అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వర్తిస్తోంది. ప్రస్తుతం ఆ సంస్థను ఆయన కుమారులు చూసుకుంటున్నారు. ఇక, మిత్తల్ కుమార్తె ఉషా సంగవాన్.. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు తొలి మహిళా మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించడం విశేషం. ఇదిలాఉంటే, ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా ప్రకారం.. 116 బిలియన్ డాలర్ల నికర సంపదతో ముకేశ్ అంబానీ ప్రపంచంలో 9వ స్థానంలో నిలిచారు. 2023లో ఆయన సంపద 83.4 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక భారత్‌లో రెండో సంపన్నుడైన గౌతమ్ అదానీ 17వ స్థానంలో ఉన్నారు. మొత్తంగా దేశ సంపన్నుల సంఖ్య 200కు చేరింది.

గరుడ వార్త

మంగళవారం, ఏప్రిల్ 9, 2024

# ఈ ఎన్నికల్లో మోడీ వేవ్ లేదు



బెంగళూరు : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 'మోడీ వేవ్' లేదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం చెప్పారు. కర్నాటకలో కాంగ్రెస్‌కు, దానిఐదు గ్యారంటీలకు అనుకూలంగా ప్రజల్లో ఉత్సాహం కానవస్తున్నదని ఆయన తెలిపారు. బెంగళూరు నగర మంచినీటి సమస్యల పరిష్కారం, మేకేదాతు ప్రాజెక్టు అమలు కోసం బిజెపి అభ్యర్థి, ఎంపి తేజస్వి సూర్యను ఓడించవలసిందిగా బెంగళూరు సౌత్ పార్లమెంటరీ నియోజకవర్గం వోటర్లకు సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. కర్నాటక ప్రతిపాదించిన బహుళార్థ సాధక (మంచినీటి, విద్యుత్) ప్రాజెక్టు మేకేదాతు. ఈ ప్రాజెక్టు కింద రామనగర జిల్లాలో కనకపుర సమీపాన ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించవలసి ఉంటుంది. కాంగ్రెస్, దాని ఐదు గ్యారంటీ పథకాల పట్ల జనంలో మొగ్గు కనిపిస్తోందని, ప్రధాని నరేంద్ర మోడీకీ అనుకూలంగా గాలి వీచడం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. 'వారి (బిజెపి) అభ్యర్థులు చాలా మంది తమ మొహం చూపించలేరు. వారు మోడీపై ఆధారపడి ఉన్నారు. మోడీ పేరిట తమకు వోట్లు వస్తాయని వారి భావన. అయితే, ఈ సారి నరేంద్ర మోడీ అంశం పని చేయదు. పది సంవత్సరాల పాటు ప్రధానిగా మోడీ అన్ని రంగాల్లో విఫలం అయ్యారు' అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ మాత్రమే సమాజంలోని అన్ని వర్గాల కోసం పాటుపడగలదని ఆయన చెప్పారు.

బెంగళూరు సౌత్ స్థానంలో మాజీ ఎంఎల్‌ఎ సౌమ్యా రెడ్డికి వోటు వేయవలసిందిగా ప్రజలకు సిద్ధరామయ్య విజ్ఞప్తి చేస్తూ, వోట్లు అడిగేందుకు సూర్యకు, ఇతర బిజెపి ఎంపిలకు నైతిక హక్కు లేదని అన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న 'అన్యాయాలపై' వారు ఎన్నడూ మాట్లాడలేదని ఆయన ఆరోపించారు. 'బెంగళూఉ మంచినీటి కొరత ఎదుర్కొంటున్నది. నగర నీటి అవసరాల్లో 60 శాతం మాత్రమే కావేరి నుంచి తీరుతున్నాయి. తక్కిన 40 శాతం బోర్‌బావి నుంచి నీళ్లు వస్తున్నాయి. నగర చుట్టుపక్కల గల 110 గ్రామాలకు నీటి సరఫరాకు, శాశ్వత పరిష్కారం సాధనకు మేముకావేరి ఐదవ దశ ప్రాజెక్టును అమలు చేస్తున్నాం.అది అమలైతే పరిస్థితి మెరుగవుతుంది' అని సిద్ధరామయ్యపేర్కొన్నారు. అయితే, మేకేదాతు ప్రాజెక్టుకు పొరుగున ఉన్న తమిళనాడు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. అది అమలైతే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని తమిళనాడు భయపడుతోంది.

# ఇసి ఎదుట టిఎంసి ధర్నా.. అరెస్ట్

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థల అధిపతులను మార్చాలని డిమాండు చేస్తూ ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం వెలుపల 24 గంటల ధర్నా చేపట్టిన తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులను



ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సిబిఐ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఎ), ఆదాయం పన్ను శాఖ(ఐటి) అధిపతులను మార్చాలని డిమాండు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్ పూర్తి బెంచ్‌ను కలిసింది. ప్రతినిధి బృందంలో డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్, సాకేత్ గోఖలే, సాగరికా ఘోస్ ఉన్నారు. తమ డిమాండును ఎన్నికల కమిషన్‌కు తెలియచేశామని, తమ డిమాడును సాధించేందుకు 24 గంటల ధర్నా చేపట్టామని ఎన్నికల కమిషన్ కార్యాలయం వెలుపల విలేకరులకు డోలా సేన్ తెలిపారు. కాగా..ధర్నా చేస్తున్న నాయకులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) ప్రస్తుత చీఫ్‌లను తొలగించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వెలుపల 24 గంటల ధర్నా చేసినందుకు తృణమూల్ కాంగ్రెస్ నాయకులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి), మరియు ఆదాయపు పన్ను శాఖ. ఎన్నికల సంఘం ఫుల్ బెంచ్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో టిఎంసి ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్, సాకేత్ గోఖలే, సాగరిక ఘోష్ తదితరులు ఉన్నారు.

మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి పార్టీ ప్రకారం, సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ పార్టీ కార్యకర్తలను "తప్పుగా భయపెట్టడానికి" ఎన్ఐఏ ని బిజెపి "దుర్వినియోగం" చేసే అవకాశం ఉ ందన్నఅంశాన్ని వారు లేవనెత్తారు. "మా ప్రజాస్వామ్యం యొక్క పవిత్రతకు హాని కలిగించే ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన ప్రయత్నాలను మేము సహించము, అటువంటి కార్యకలాపాలను అంతం చేయడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడానికి కలిసి నిలబడతామని ప్రతిజ్ఞ చేసాము" అని టిఎంసి గతంలో ట్విట్టర్‌గా పిలిచే ఎక్స్ లో రాసింది. టిఎంసి ఎంపి డోలా సేన్ మీడియాతో మాట్లాడుతూ, "బిజెపి మాకు వ్యతిరేకంగా, కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోంది. ఎన్ఐఏ, ఈడి, సిబిఐ పని చేస్తున్న తీరు.. టిఎంసి నేతలను టార్గెట్ చేయడం సిగ్గుచేటు. అన్ని రాజకీయ పార్టీలకు ఒక స్థాయి ప్లేయింగ్ ఫీల్డ్ ఉండేలా చూడాలని మేము ఈసిని అభ్యర్థిస్తున్నాము" అన్నారు.

# సతీసమేతంగా బిజెపిలో చేరిన మాజీ ఐపిఎస్



లక్నో: మాజీ ఐపిఎస్ అధికారి విజయ్ కుమార్, ఆయన భార్య అనుపమ సోమవారం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాషాయ కండువా కప్పుకున్నారు. ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ సమక్షంలో కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బిజెపిలో చేరారు. 2023 మే నుంచి 2024 జనవరి వరకు ఉత్తర్ ప్రదేశ్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డిజిపి)గా పనిచేసిన 1988 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన విజయ్ కుమార్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి తాను బిజెపిలో చేరినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పనితీరుతో తాను ఆకర్షితుడనయ్యానని, సమాజ సేవ చేయాలన్న తలంపుతో పార్టీలో చేరానని ఆయన చెప్పారు. పోలీసు అధికారికి, ప్రజలకు మధ్య కొంత ఎడం ఉంటుందని, కాని రాజకీయాలలో అందరితో కలసి ఉండాల్సి ఉంటుందని విజయ్ కుమార్ అన్నారు. ప్రజలతో మమేకమవ్వడం తనకు అలవాటేనని, తనకు ఎటువంటి సమస్య ఉండదని భావిస్తున్నానని ఆయన చెప్పారు.

# కచ్చతీవుపై డిఎంకె, కాంగ్రెస్ వివరణ ఇవ్వాలి

చెన్నై : కచ్చతీవును 1974లో శ్రీలంకకు వదులుకోవడంపై డిఎంకె, కాంగ్రెస్ వివరణ ఇవ్వాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ సోమవారం కోరారు. ఈ అంశంపై అవి 'తమ కళంకాన్ని తొలగించుకోవాలి' అని కూడా ఆయన కోరారు. ప్రధాని నరేంద్ర మోడీనూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శకు ఠాకూర్ ఆక్షేపణ తెలియజేస్తూ, రాష్ట్రానికి మోడీ వస్తారంటే స్టాలిన్ ఎందుకు 'వణుకుతున్నారు' అని అడిగారు. ఠాకూర్ చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ, ఒక వైపు ప్రధాని మోడీ మత్స్యకారులకు సబ్సిడీలు, విధానాలు, కార్యక్రమాలు సహా ఎన్నో ఇస్తుంటే మరొక వైపు డిఎంకె, కాంగ్రెస్ కచ్చతీవును శ్రీలంకకు ఇచ్చివేశాయని వ్యాఖ్యానించారు. 'అవి బాహాటంగా దీనికి స్పందించాలి. కచ్చతీవును లంకకు ఇవ్వడానికి ఎవరు బాధ్యులు? డిఎంకె, కాంగ్రెస్ దీనిపై ఎందుకు మౌనం దాల్చాయి? ముఖ్యమైన భూభాగాన్నిఅవి ఎందుకు శ్రీలంకకు ఇచ్చివేసి, జాలర్లు, తమిళుల మనోభావాలను గాయపరిచాయి?' అని ఠాకూర్ అన్నారు. మోడీపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు తమిళనాడుకు మోడీ వస్తున్నారంటే ఆయన ఎంత ఇబ్బంది పడుతున్నారో సూచిస్తున్నాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'ఆయన ఎందుకు వణుకుతున్నారు? తమిళనాడును, దాని ఘన సంస్కృతిని, సాంప్రదాయక చరిత్రను ప్రేమించే ప్రధానిని తమిళనాడు ప్రజలు అభిమానిస్తున్నందున ఆయన పర్యటనకు స్టాలిన్ ఆనందించాలి' అని



ఠాకూర్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల స్పందనను బట్టి బిజెపి ఈసారి 400 పైచిలుకు సీట్లను సులభంగా గెలుస్తుందని ఠాకూర్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావడానికి వీలుగా మోడీ వరుసగా మూడవ పర్యాయం ప్రధాని పదవి అధిష్ఠించాలని జనం కోరుకుంటున్నారు' అని ఠాకూర్ చెప్పారు.

# ఎన్నికల ముందు ఎందరిని జైలులో పెడతారు?



న్యూఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌పై కించపరిచే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న ఒక యూట్యూబర్‌కు మంజూరైన బెయిల్‌ను సుప్రీం కోర్టు పునరుద్ధరించింది. సోషల్ మీడియాలో ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరినీ జైలులో పెట్టజాలరని కోర్టు వ్యాఖ్యానించింది. తనకు మంజూరైన స్వేచ్ఛను ఎ దురైమురుగన్ సట్టై దుర్వినియోగం చేశారనేందుకు దాఖలాలు ఏవీ లేవని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. తమిళనాడుకు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి జస్టిస్ ఓకా విచారణ సమయంలో ఒక కీలక ప్రశ్న వేశారు. 'ఎన్నికలకు ముందు యూట్యూబ్‌లో ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరినీ కటకటాల వెనుకకు పంపడాన్ని మనం ప్రారంభించినట్లయితే ఎంత మంది జైలులో ఉంటారో ఊహించండి' అని జస్టిస్ ఓకా అన్నారు. బెయిల్‌పై ఉ ండగా దురుద్దేశంతో వ్యాఖ్య చేయకుండా సట్టైను నిరోధించాలన్న షరతు విధించాలన్న అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఒక ప్రకటన దురుద్దేశంతో చేసిందని ఎవరు నిర్ధారిస్తారని ముకుల్ రోహత్గిని జస్టిస్ ఓకా అడిగారు. తన బెయిల్‌ను మద్రాసు హైకోర్టు రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ సట్టై దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు పైవిధంగా తీర్పు ఇచ్చింది.

# ఎన్నికల తర్వాత ప్రతిపక్షాలకు జైలు శిక్ష తప్పదని మోడీ హామీ: మమతా బెనర్జీ




కోల్‌కతా: ఈ లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల మంత్రాన్ని కొట్టివేస్తూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ రోజు "మోదీ కి గ్యారెంటీ" అంటే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చే జూన్ 4 తర్వాత ప్రతిపక్ష నాయకులందరూ జైలులో ఉంటారని అన్నారు. బయట ఉండు. ఉత్తర బెంగాల్‌లోని జలపాయిగురిలో ఎన్నికల ర్యాలీలో ప్రధాని ప్రసంగించిన ఒక రోజు తర్వాత తృణమూల్ అధినేత ఎదురుదాడికి దిగారు. 'వాళ్లకు కావాల్సినంత కుట్రలు చేయనివ్వండి.. జూన్ 4 తర్వాత అవినీతిపరులపై చర్యలు పుంజుకుంటాయని నేను మీకు హామీ ఇస్తున్నాను. మీరు చెప్పండి, మనం ఈ దేశం నుంచి అవినీతిని తరిమికొట్టాలా వద్దా? అవినీతిని అంతం చేయకూడదా?అవినీతిపరులను జైలుకు పంపకూడదా?, టీఎంసీ అవినీతిని వదిలించుకోకూడదా?ఇది మోదీ హామీ అని ఆయన అన్నారు. ఈరోజు బంకురాలో జరిగిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలపై బెనర్జీ స్పందించారు. "మోదీ గ్యారెంటీ ఏమిటి? జూన్ తర్వాత అందరినీ జైల్లో పెడతాడని. ఇదేనా ప్రధాని భాష? జూన్‌లో ఎన్నికలు ముగిశాక వ్యక్తులను ఎంచుకుని అరెస్టు చేస్తారా? అందరినీ జైల్లో పెడతారా?" ఆమె చెప్పింది. హిందూస్థాన్‌ను జైలుగా మార్చేశారని బీజేపీ, ప్రధానిని ఆరోపించిన ఆమె.. "మీరు ఎక్కడికక్కడ జైళ్లు చేశారని.. ఒక జేబులో ఎన్ఐఏ, మరో జేబులో సీబీఐ.. ఒక జేబులో ఈడీ.. మరొక జేబు, ఆదాయపు పన్ను. NIA మరియు CBI, BJP కా భాయ్ భాయ్. ఆదాయపు పన్ను మరియు ED పన్నులు బిజెపి నిధుల సేకరణ పెట్టె," అని ఆమె అన్నారు, బిజెపి నేతృత్వంలోని కేంద్రం రాజకీయ లక్ష్యాల కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని ప్రతిపక్షాల ఆరోపణను రెట్టింపు చేసింది. బెనర్జీ తనకు భయం లేదని అన్నారు. 'ఎవరిని బెదిరిస్తున్నావు.. మా ఐదుగురు యువకులను అరెస్ట్ చేస్తే వాళ్ల భార్యలు వీధిన పడతారు. ఎన్నికల తర్వాత బీజేపీ నేతలను జైల్లో పెడతానని చెబితే ఎలా ఉంటుంది.. అయితే ప్రజాస్వామ్యంలో ఇది ఆమోదయోగ్యం కాదని ఆమె అన్నారు.

బెంగాల్‌లోని 42 లోక్‌సభ స్థానాలకు ఏడు దశల ఎన్నికలు ఈ ఎన్నికలలో అత్యధికంగా వీక్షించిన పోటీలలో ఒకటి. 2019లో 18 సీట్లు గెలుచుకుని రెండో స్థానంలో నిలిచిన బీజేపీ, అధికార తృణమూల్‌కు వ్యతిరేకంగా తన సంఖ్యను మెరుగుపరుచుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ సంవత్సరం, అధికార తృణమూల్‌పై అవినీతి ఆరోపణలపై బిజెపి తన బెంగాల్ ప్రచారాన్ని కేంద్రీకరించింది మరియు సందేశ్‌ఖాలీ సమస్యను ఆడుతున్నది. ఉత్తర 24 పరగణాస్‌లోని ఒక ద్వీపం, సందేస్‌ఖాలీ స్థానిక తృణమూల్ నాయకులపై భూకబ్జా, దోపిడీ మరియు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించడంతో జాతీయ ముఖ్యాంశాలుగా నిలిచాయి. ఇడి బృందంపై మూక దాడికి సంబంధించిన కేసులో ఇడి కస్టడీలో ఉన్న సందేస్‌ఖాలీ బలమైన వ్యక్తి షేక్ షాజహాన్‌ను తృణమూల్ అప్పటి నుండి బహిష్కరించింది.

# మోడీని నిలదీసిన ఖర్గే



న్యూఢిల్లీ: కాంగ్రెస్ మేనిఫెస్టలో ముస్లిం లీగ్ ముద్రలు ఉన్నాయంటూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం తిప్పికొట్టారు. రోజురోజుకూ తన ఎన్నికల విజయావకాశాలు పడిపోతున్న నేపథ్యంలో ఆర్‌ఎస్ఎస్ తన మంచి మిత్రుడిని గుర్తు చేసుకోవడం మొదలు పెట్టిందని ఖర్గే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గత శుక్రవారం విడుదల చేసిన మేనిఫెస్టోపై ముస్లిం లీగ్ ప్రభావం ఉందని ప్రధాని మోడీ ఆరోపించిన నేపథంలో దీనికి ఖర్గే సోమవారం కౌంటర్ ఇచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలోని కొన్ని ప్రావిన్సులలో ఉన్న కూటమి ప్రభుత్వాలలో జనంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ భాగస్వామిగా ఉన్నారని ఖర్గే గుర్తు చేశారు. కాగా..ప్రజల దృష్టిని మళ్లించి మళ్లీ విచ్ఛిన్నకర అజెండాను తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా బిజెపి ఈ దాడి మొదలుపెట్టిందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. బిజెపి కుతంత్రాన్ని బయటపెటేందుకు దూకుడుగా వెళ్లాలని పార్టీ నిర్ణయించుకున్నట్లు వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోపై తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాపై ఎక్స్ వేదికగా ఖర్గే మండిపడ్డారు. దేశంలోని సగటు పౌరుల ఆశయాలు, అవసరాలు, డిమాండ్ల ప్రాతిపదికగా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకల్పన జరిగిందని ఖర్గే స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులకు వ్యతిరేకంగా బ్రిటిష్, ముస్లిం లీగ్‌కు మోడీ–షా రాజకీయ, సిద్ధాంతపర పూర్వీకులు మద్దతుపలికారని ఖర్గే విమర్శించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అధ్యక్షతన 1942లో జరిగిన సమావేశంలో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునివ్వగా దీన్ని కూడా మోడీ–షా రాజకీయ, సిద్ధాంతపర పూర్వీకులువ్యతిరేకించారని ఆయన గుర్తు చేశారు. ముస్లిం టీగ్ మద్దతుతో 1940వ దశకలో బెంగాల్, సింధ్, ఎన్‌డబ్లుఎఫ్‌పిలో వ్యామ ప్రసాద ముఖర్జీ ఎలా ప్రభుత్వాలను ఏర్పాటు చేశారో అందిరికీ తెలుసునని ఖర్గే వ్యాఖ్యానించారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఎలా అలా ఎదుర్కోవాలో, కాంగ్రెస్‌ను ఎలా అణచివేయాలో వివరిస్తూ అప్పటి బ్రిటిష్ గవర్నర్‌కు శ్యామ ప్రసాద్ ముఖర్జీ లేఖ రాయలేదా అని ప్రధాని మోడీని ఖర్గే ప్రశ్నించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com